ప్రజాశక్తి

శుక్రవారం 26 జనవరి 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

చిరస్మరణీయుడు బాలకృష్ణ

- ఆయన మృతి ప్రజా ఉద్యమానికి తీరని లోటు
- సంస్మరణ సభలో వక్తలు



సంస్మరణ సభలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు, వేదికపై వి.శ్రీనివాసరావు, దాడి వీరభద్రరావు, పలువురు ప్రముఖులు, బాలకృష్ణ కుటుంబీకులు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, అనకాపల్లి విలేకరి

సిపిఎం సీనియర్ నాయకులు అంగులూరి బాలకృష్ణ సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన మృతి కష్టజీవుల ఉద్యమానికి తీరని లోటని తెలిపారు. పార్టీ అనకాపల్లి మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ అధ్యక్షతన గురువారం సాయంత్రం వివి రమణ రైతు భారతి ఫంక్షన్ హాల్లో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బాలకృష్ణ సంసర్మణ సభ జరిగింది. ఉమ్మడి విశాఖ జిల్లా నలుమూలల నుంచీ సిపిఎం కార్యకర్తలు, నాయకులు, బాలకృష్ణ అభిమానులు తరలివచ్చారు. సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మత విభజన రాజకీయాల స్థానంలో ప్రజల సమస్యలపై కలిసి పనిచేసే సమైక్య రాజకీయాలు రావాలన్నారు. ఆ తరహా ప్రత్యామ్నాయ రాజకీయాలకు ప్రతినిధిగా బాలకృష్ణ పనిచేశారని గుర్తు చేశారు. కుటుంబానికి ఆస్తులను కాకుండా ఆశయాన్ని వారసత్వంగా అందించిన ఉత్తమ కమ్యూనిస్టు బాలకృష్ణ అని కొనియాడారు. చరిత్రలో ఏ పోరాటమూ వృథాకాదని, ప్రతి దానికీ ఫలితం ఉంటుందని అన్నారు. విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో బషీర్‌బాగ్‌లో ప్రభుత్వం జరిపిన కాల్పులు తరువాత 20 ఏళ్లకుపైగా విద్యుత్ ఛార్జీలు పెంచడానికి ప్రభుత్వాలు భయపడ్డాయని అన్నారు. ప్రజా ఉద్యమాలతో మిగతా 2లో..

విశాఖ పోర్టు డబుల్ రికార్డ్

నౌకల హ్యాండ్లింగ్‌లో సరికొత్త ప్రగతి



పోర్టులో భారీ నౌక

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నం పోర్టు అథారిటీ జనవరి మాసంలో రెండు నూతన రికార్డులను నెలకొల్పింది. గతంలో నెలకొల్పిన రికార్డులను తిరగరాస్తూ ప్రగతిని సుసాధ్యం చేసింది. నౌకల హ్యాండ్లింగ్‌లో 10125 టన్నుల కాల్సినెడ్ అల్యూమినాను 844 టన్నుల గ్యాంగ్ హుక్ అవుట్‌పుట్ సామర్థ్యంతో ఈస్ట్ క్యూ 4 బెర్త్‌లో ఎంవి ఎవరెస్ట్ కె షిప్‌లో ఎక్కించడం ద్వారా జనవరి 23వ తేదీన ఈ రికార్డు నెలకొల్పింది. ఉత్కల్ అల్యుమినా ఇంటర్ నేషనల్ సంస్థ ఈ షిప్ ద్వారా సరుకును ఎగుమతి చేసింది. గతంలో 23 డిసెంబర్ 2023న 8379 టన్నుల కాల్సినెడ్ అల్యూమినాను 699 గ్యాంగ్ హుక్ అవుట్‌పుట్ సామర్థ్యంతో ఈక్యూ 6 బెర్త్‌లో ఎంవి ఫెయిత్ అనే నౌకలోకి ఎక్కించి రికార్డును నెలకొల్పిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ రికార్డును పోర్టు తిరగరాసింది. శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ స్టివెడోర్స్‌గా వ్యవహరించగా ఇంటర్ ఓషన్ షిప్పింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ స్టీమర్ ఏజెంట్లుగా వ్యవహరించాయి.

ఇక ఈ నెల 21న విశాఖపట్నం పోర్టు అథారిటీ మరో రికార్డును నెలకొల్పింది. దేశ్ విభోర్ అనే భారీ ఇంపోర్ట్ క్రూడ్ ట్యాంకర్‌ను పోర్టు హ్యాండిల్ చేసింది. దీని పొడవు 333 మీటర్లు, భీమ్ 60 మీటర్లుగా ఉంది. ఈ నౌక నుంచి హెచ్‌పిసిఎల్ కోసం 281142.257 టన్నుల మిగతా 2లో..

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

వార్త 8లో..

డిఎస్‌సిపై బొత్స మాటలు ఏమయ్యాయి : డివైఎఫ్ఐ

వార్త 4లో..

ప్రగతిపథంలో ఈస్ట్ కోస్ట్ రైల్వే

వార్త 2లో..

భారత్, ఇంగ్లండ్ టెస్టుకు.. / నేటి నుంచి ఆఫ్‌లైన్‌లో టికెట్ల విక్రయాలు

ప్రజాశక్తి - పిఎం.పాలెం : ఫిబ్రవరి 2 నుంచి 6వ తేదీ వరకు విశాఖపట్నం వేదికగా భారత్ - ఇంగ్లాండ్ జట్ల మధ్య జరగనున్న రెండో అంతర్జాతీయ టెస్టు మ్యాచ్ కోసం శుక్రవారం నుంచి ఆఫ్‌లైన్‌లో టికెట్ల విక్రయాలు ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని ఎసిఎ కార్యదర్శి ఎస్ఆర్. గోపినాథ్‌రెడ్డి గురువారం వెల్లడించారు. అందులో భాగంగానే ఫిబ్రవరి 6వ తేదీ వరకు పిఎం.పాలెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఎసిఎ - విడిసిఎ క్రికెట్ స్టేడియం వద్ద, ఫిబ్రవరి 1వ తేదీ వరకూ స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్లలో టికెట్లు విక్రయించనున్నట్లు తెలిపారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు టికెట్లు విక్రయించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 15వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో టికెట్లు విక్రయిస్తున్న మిగతా 2లో..

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లు



శుక్రవారం జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు విశాఖలోని పోలీసు బ్యారెక్స్ ముస్తాబైంది. గురువారం సాయంత్రానికే అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. జాతీయ స్ఫూర్తిని గుర్తు చేసేలా కలెక్టరేట్, రైల్వే స్టేషన్ల వద్ద మూడు రంగుల జాతీయ జెండాను పోలినట్లు విద్యుత్ దీపాలను అలంకరించారు.

మొదటి పేజీ తరువాయి..



బాలకృష్ణ జీవిత చరిత్రపై ముద్రించిన పుస్తకాన్ని, ప్రజాశక్తి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న వి.శ్రీనివాసరావు, నర్సింగరావు, దాడి వీరభద్రరావు, లోకనాథం తదితరులు

చిరస్మరణీయుడు బాలకృష్ణ

పెనవేసుకుపోయిన, తుదిశ్వాస వరకు ఉద్యమాలు నడిపిన ఆదర్శ కమ్యూనిస్టు బాలకృష్ణ అని అన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ అనకాపల్లి ప్రాంతంలో సిపిఎం సీనియర్ నాయకులు దొడ్డి రామనాయుడు అనంతరం బాలకృష్ణ పార్టీ విస్తరణకు ఎంతో కృషి చేశారన్నారు. విద్యార్థి, యువజన, రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘం నాయకులుగా అన్ని వర్గాల కార్మికుల సమస్యలపై పోరాటాలు చేశారన్నారు. ప్రజా ఉద్యమాలకే ఆయన జీవితాన్ని అంకితం చేసిన త్యాగశీలి అని కొనియాడారు. ఈ ప్రాంతంలో మళ్ల సత్యనారాయణ, బాలకృష్ణ సమన్వయంతో కార్మిక సంక్షేమానికి కృషి చేశారని గుర్తు చేశారు. సిపిఎం బాలకృష్ణ కుటుంబానికి అండదండగా నిలుస్తుందని భరోసానిచ్చారు. సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ బతికుండగా ప్రజా సేవకే అంకితమైన బాలకృష్ణ మరణానంతరం కూడా తన పార్థివ దేహాన్ని సమాజానికి ఉపయోగపడేలా వైద్య కళాశాలకు దానం చేశారన్నారు. బాలకృష్ణ, మళ్ల సత్యనారాయణ పేర్లపై ప్రతి ఏటా సిపిఎం కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో బాలకృష్ణకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. జిల్లా సమస్యలపై స్పష్టమైన అవగాహనతో ఆయన పనిచేశారన్నారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు బి.ప్రభావతి మాట్లాడుతూ బాలకృష్ణ పార్టీలో మహిళలను ఎంతో గౌరవంగా చూసుకునేవారన్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ ఉద్యమాల ద్వారా అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ధీశాలి బాలకృష్ణ అని కొనియాడారు. కరోనా సమయంలో జనజీవనం స్తంభించిన సమయంలోనూ ప్రజాసేవకే అంకితం అయ్యారన్నారు. లీడర్ పత్రిక అధిపతి వివి.రమణమూర్తి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ఉద్యమ బాటలో బాలకృష్ణ నడిచారన్నారు. వైసిపి నాయకులు మలసాల రమణరావు మాట్లాడుతూ సిపిఎం బలోపేతానికి బాలకృష్ణ ఎనలేని కృషి సలిపారన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ ప్రజా, రైతు సమస్యల పరిష్కారానికి బాలకృష్ణ అలుపెరగని పోరాటాలు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, విశాఖపట్నం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఉషోదయ విద్యాసంస్థల నిర్వాహకులు రమణాజీ, ఎపి రైతు సంఘం నాయకులు రాంబాబు, సిపిఐ ఎంఎల్ నాయకులు పిఎస్.అజయ్ కుమార్, వైసిపి నాయకులు డాక్టర్ విష్ణుమూర్తి, సిపిఐ నాయకులు వైఎన్.భద్రం, ఐద్వా విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు బి.పద్మ, కౌలు రైతు సంఘం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, డి.వెంకన్న, బాలకృష్ణ భార్య వరలక్ష్మి, కుమారుడు వెంకట సత్యప్రసాద్, కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు. తొలుత గౌరి, సుభాషిణి బృందం బాలకృష్ణ త్యాగాలను, పోరాటాలను గుర్తుచేస్తూ గీతాలు ఆలపించారు.

విశాఖ పోర్టు డబుల్ రికార్డ్

క్రూడ్ ఆయిల్‌ను దిగుమతి చేసింది. గతంలో ఎలంద్రా డెనాలి అనే 329.99 మీటర్ల వెడల్పు, 60 మీటర్ల భీమ్ కలిగిన నౌక నుంచి 280800 టన్నుల క్రూడ్ అయిల్‌ను దిగుమతి చేసిన విషయం తెలిసిందే. ఆ రికార్డును ప్రస్తుతం తిరగరాసింది.

ఈ ఘనతలను సాధించిన పోర్టు ట్రాఫిక్ మేనేజర్ (టిఎమ్) రత్నశేఖర్‌ను, ట్రాఫిక్ సిబ్బందిని పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అభినందించారు. మరిన్ని రికార్డులు నెలకొల్పడంతో పాటు మంత్రిత్వ శాఖ నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. పోర్టు రికార్డుల వివరాలను కార్యదర్శి టి.వేణుగోపాల్ మీడియాకు గురువారం సాయంత్రం వెల్లడించారు.

నేటి నుంచి ఆఫ్‌లైన్‌లో టికెట్ల విక్రయాలు

విషయం తెలిసిందే.

ఆఫ్‌లైన్‌లో టికెట్ల ధరలు ఇలా..

రోజుకు రూ.100+సీజన్‌కు రూ.400
రోజుకు రూ.200+సీజన్‌కు రూ.800
రోజుకు రూ.300+సీజన్‌కు రూ.1,000
రోజుకు రూ.500+సీజన్‌కు రూ.1,500

ఉచిత ప్రవేశాలు

రోజుకు 2,850 మంది క్లబ్ క్రీడాకారులకు, 2 వేల మంది విద్యార్థులకు ఉచిత ఎంట్రీ ఉంటుంది. విద్యార్థులు ఐడీ కార్డులు తప్పనిసరిగా తీసుకురావాలి.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగర ప్రజల అవసరాలకు అనుగుణంగా జివిఎంసి మౌలిక వసతులు కల్పిస్తోందని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. గురువారం ఆమె మూడో జోన్ 16వ వార్డు పరిధిలోని ఇసుకతోట రామాలయం వద్ద సుమారు రూ.38.40 లక్షలతో సిసి రోడ్లు, కాలువల నిర్మాణానికి పార్లమెంటు సభ్యులు ఎంవివి.సత్యనారాయణ, కార్పొరేటర్ మొల్లి లక్ష్మీ అప్పారావులతో కలిసి శంకుస్థాపన చేశారు.

ఆర్‌కె బీచ్‌లో ఇసుక కోత లేకుండా నౌరిష్‌మెంట్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : ఆర్‌కె బీచ్ ప్రాంతంలో ఒడ్డుకు వచ్చిన ఇసుకను లోపలకు యంత్రాల ద్వారా విడిచి పెట్టే షోర్ పంపింగ్ నౌరిష్‌మెంట్ పనులను విశాఖ పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు గురువారం ప్రారంభించారు. సామాజిక బాధ్యతలో బాగంగా పోర్టు చేపట్టిన ఈ పనులను డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చేపట్టింది. అందులో భాగంగా మూడేళ్లలో 57.26 కోట్ల రూపాయలతో 6.3 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తవ్వే పనులను పోర్టు డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌కు కేటాయించింది. కాంట్రాక్టులో బాగంగా రెండో ఏడాది 19.09 కోట్ల రూపాయల విలువైన 2.1 లక్ష క్యూబిక్ మీటర్ల ఇసుకను డిసిఐ తవ్వనుంది. ఈ పనులను 30 రోజుల పాటు కొనసాగించనుంది. ఈ సందర్భంగా అంగముత్తు మాట్లాడుతూ విశాఖ పట్నం సహజత్వాన్ని కాపాడేందుకు తీరంలో పోర్టు నిధులతో కొన్నేళ్లుగా బీచ్ నిర్వహణ పనులను చేపడుతున్నట్టు వెల్లడించారు.



తీరంలో నౌరిష్‌మెంట్ పనులను ప్రారంభిస్తున్న అంగముత్తు

కోత నివారణ కోసం డిసిఐ వద్ద ఉన్న అత్యాధునిక డ్రెడ్జర్లను వినియోగి స్తున్నామని తెలిపారు. పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ ఛైర్మన్ దుర్గేష్ కుమార్ దూబె, పోర్టు చీఫ్ విజిలెన్స్ అధికారి పిఎస్.లింగేశ్వర స్వామి, కెప్టెన్ కెఎం.చౌదరి, పోర్టు కార్యదర్శి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతిపథంలో ఈస్ట్ కోస్ట్ రైల్వే

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గడిచిన ఏడాది కాలంలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే దేశంలోనే అత్యుత్తమ పురోగతిని సాధించిందని ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ తన 75వ గణతంత్ర దినోత్సవ సందేశంలో గురువారం పేర్కొన్నారు. దేశంలోనీ అన్ని జోన్లనూ వెనక్కు నెట్టి 245 రోజుల అతి తక్కువ వ్యవధిలో 200 మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేసినట్టు తెలిపారు. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద 57 స్టేషన్లను పునరాభివృద్ధి చేస్తున్నామన్నారు. అందులో పూరి, భువనేశ్వర్, కటక్ రైల్వే స్టేషన్ల పనితీరు మెరుగ్గా సాగుతోందన్నారు. గడిచిన ఏడాది కాలంలో ప్రయాణికుల కోసం 1147 ట్రిప్పుల ప్రత్యేక రెళ్లను నడిపామని వెల్లడించారు. డిసెంబర్ 2023వ సంవత్సరంలో 17712 కోట్ల స్థూల ఆదాయం పొందినట్టు తెలిపారు. ఇది గడిచిన ఏడాదితో పోలిస్తే 7.65 శాతం ఎక్కువ అని పేర్కొన్నారు.

సమయంలో 63.14 మిలియన్ల ప్యాసింజర్లను తమ గమ్యస్థానాలకు రైల్వే చేర్చిందని, ఇది గత ఏడాదితో పోల్చుకుంటే 14.63 శాతం ఎక్కువని ఆయన పేర్కొన్నారు రైల్వే భద్రత విషయానికి వస్తే ఈ ఏడాది ఫైర్ స్మోక్ డిటెక్షన్ సిస్టం ప్రవేశపెట్టామని, దీనిని ఇప్పటికే 43 కోచ్‌ల్లో, 21 పాంట్రీ కార్లలో పెట్టామని తెలిపారు.

హెల్త్ సెక్రటరీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వార్డు, గ్రామ సచివాలయ హెల్త్ సెక్రటరీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీల అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. గురువారం అసోసియేషన్ తరపున జిల్లా కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం సమర్పించారు. ఈ ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగన్ మోహన్ మీడియాతో మాట్లాడుతూ సచివాలయ హెల్త్ సెక్రటరీలు, సీనియర్ ఎఎన్ఎంలు దాదాపు 70 రకాల యాప్‌లపై పనిచేయాల్సి వస్తోందన్నారు. ఒకేరోజు అనేక కార్యక్రమాలను అప్లోడ్ చేయాల్సి వస్తోందని తెలిపారు.

వాసుపల్లికే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : మత్స్యకార సామాజిక తరగతికి చెందిన వాసుపల్లి గణేష్ కుమార్‌కు ఈసారి దక్షిణ నియోజకవర్గ టికెట్ ఇవ్వాలని వైసిపి అధిష్టానానికి గంగవరం సంప్రదాయ సాగర మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షులు చోడిపల్లి రాజు విజ్ఞప్తి చేశారు. గురువారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు.

ఆర్థిక బకాయిలు విడుదల చేయాలని ఆందోళన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు బకాయి పడ్డ సొమ్మును తక్షణం ప్రభుత్వం విడుదల చేయాలంటూ యుటిఎఫ్ విశాఖపట్నం జిల్లా కమిటీ ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్‌లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెరుగైన పిఆర్‌సి, క్రమం తప్పకుండా డిఎలు ఇస్తానని, సిపిఎస్ రద్దుచేసి ఓపిఎస్‌ను అమలు చేస్తానని హామీలను ఇచ్చి నేటికీ నెరవేర్చలేదన్నారు. ఉద్యోగులకు కోట్లాది రూపాయల బకాయి పడిందని తెలిపారు. ఇప్పటికైనా స్పందించాలని, లేనిపక్షంలో జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3 వరకూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాడాన అప్పారావు, జిల్లా కోశాధికారి కె.రాంబాబు, జిల్లా కార్యదర్శులు రిజ్వాన్, రియాజ్, చినగదిలి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.ప్రసాద్, పద్మావతి, జివిఎంసి సీనియర్ నాయకులు జనార్ధన్‌రావు, గెంజి మహేష్, నీలాద్రి, విజయ కుమారి, అరుణ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

సిఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెల 27వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లను జిల్లా అధికారులు పరిశీలించారు. భీమిలి మండలం సంగివలస గ్రామంలో ఏర్పాటు చేస్తున్న సభా స్థలిని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పోలీసు కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మలతో కలిసి గురువారం సాయంత్రం సందర్శించారు. సభా వేదికను, అక్కడ జరుగుతున్న రైలింగ్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ నిర్వాహకులకు పలు సూచనలు జారీ చేశారు.

చెస్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : శ్రీ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో తలపెట్టిన 2వ ఫిడే రేటింగ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను స్థానికంగా గురువారం ఘనంగా ప్రారంభించారు. ఈ టోర్నీ ఈ నెల 28వ తేదీ వరకూ కొనసాగనుంది. ప్రారంభ వేడుకకు ఎయు స్పోర్ట్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ విజయమోహన్, వాగ్దేవి ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.సురేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ టోర్నీలో 419 మంది క్రీడాకారులు పాల్గొన్నారని శ్రీ చెస్ అకాడమీ డైరెక్టర్ శ్రీకాంత్, టోర్నమెంట్ డైరెక్టర్ ఆర్.బాబూరావు తెలిపారు.

యుద్ధ ప్రాతిపదికన పైపు లైన్



తగరపువలస మెయిన్ రోడ్డు వద్ద పైపులైన్ ఏర్పాటుకు తవ్వకాలు (ఫైల్ ఫోటో)

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు

ప్రజాశక్తి -తగరపువలస

దాదాపు 15 ఏళ్ల క్రితం నాటి తాగు నీటి సరఫరా పైపు లైన్ స్థానంలో కొద్ది రోజుల క్రితమే జివిఎంసి నిధులు రూ.1.27 కోట్లతో కిలో మీటరు మేర కొత్త పైపు లైన్ నిర్మాణ పనులు చేపట్టారు. దాదాపు పైపు లైన్ నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. జివిఎంసి ఒకటో వార్డు పరిధి కొండపేటలో ఉన్న తాగు నీరు సరఫరా చేసే పంప్ హౌస్ నుంచి కొండపేట మీదుగా స్థానిక ప్రధాన రహదారి గణేష్ సినిమా థియేటర్‌కు సమీపంలో ప్రధాన రహదారి వరకు కిలో మీటరు మేర డిఐ పైపు లైన్ నిర్మాణ పనులు పూర్తిచేశారు. ప్రస్తుతం ఏర్పాటుచేసిన పైపులైన్ కాలపరిమితి దాదాపు 90 ఏళ్ల ఉంటుందని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.

జివిఎంసి భీమిలి జోన్ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పగలు, రాత్రి శ్రమించి పైపులైన్ నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా, ప్రజల రాక పోకలకు ఇబ్బంది తలెత్తకుండా పనులు వేగవంతంగా పూర్తి చేశారు. పాత పైపు లైన్ వల్ల తరచూ లీకేజీ సమస్య తలెత్తడంతో పాటు తాగు నీటికి ప్రజలు ఇబ్బందులు పడే వారు. ఇక నుంచి తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తప్పినట్లే మరి.

ముందు చూపు లేక ప్రజాధనం "రోడ్డు" పాలు?

స్థానిక ప్రధాన రహదారితో పాటుగా కొండపేటలో తారురోడ్డు నిర్మాణ, మరమ్మతు పనులు కొద్ది నెలల క్రితమే పూర్తి చేశారు. అలానే కొండపేట వైపు సిమెంట్ కాల్వల నిర్మాణం చేపట్టారు. జివిఎంసి నిధులు లక్షలు ఖర్చు చేసి తారు రోడ్డు, సిమెంట్ కాల్వల నిర్మాణం చేపట్టిన విషయం విదితమే. వీటి నిర్మాణం చేపట్టి కొద్ది నెలలకే రోడ్డు తవ్వి తాగు నీటి సరఫరా పైపు లైన్ నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పుడు చేపట్టిన పైపు లైన్ నిర్మాణ పనులు కొద్ది నెలలు ముందుగా చేపట్టి ఉంటే ప్రజాధనం వృథా అయ్యేది కాదని పలువురు అభిప్రాయపడ్డారు. ఏది ఏమైనా పైపు లైన్ నిర్మాణం పట్ల స్థానికులు ఓ వైపు హర్షం వ్యక్తం చేస్తూనే, మరో వైపు తారు రోడ్డు, సిమెంట్ కాల్వల నిర్మాణ పనులకు ముందు పైపు లైన్ ఏర్పాటు చేస్తే బాగుండేదని మరికొందరు అభిప్రాయ పడ్డారు .



పైపులైన్ ఏర్పాటుకు తవ్వేయడంతో తారు రోడ్డు కాస్తా మట్టి రోడ్డు అయిన దృశ్యం

మట్టి రోడ్డుగా మారిన తారు రోడ్డు..

పైపులైన్ ఏర్పాటు నేపథ్యంలో తగరపువలస ప్రధాన రహదారి (భీమిలి రోడ్డు), కొద్ది భాగం, కొండపేట రోడ్డు మట్టి రోడ్డును తలపిస్తుంది. వర్షం కురిస్తే రోడ్డంతా బురదమయమై నడక ఇబ్బందిగా ఉందని, వాహన రాకపోకల సమయంలో రోడ్డు పక్కన నడిస్తే బురద బట్టలపై తుళ్లి ఇబ్బందిగా ఉంటుందని పలువురు వాపోయారు. త్వరితగతిన యథాప్రకారం తారు రోడ్డు, సిమెంట్ కాల్వలు ఉండేలా పునర్నిర్మాణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

రాజయ్యపేటలో విషాదం

- ఇసుక మేటపడి యువకుడు మృతి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో విషాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రంగాల జగదీష్ (30) సెప్టిక్ ట్యాంక్ నిర్మాణాలకు సంబంధించి గోతులు తీసి, సిమెంటు తూరలు దించి పూడ్చడం వంటి కాంట్రాక్ట్ పనులు చేస్తూ ఉంటాడు. గురువారం ఉదయం రాజయ్యపేటలో ఒక ఇంటి వద్ద సెప్టిక్ ట్యాంక్ గోతిలో దిగి సిమెంట్ తూరలు దించుతున్నాడు. ఒక తూర దించిన తర్వాత, రెండవ తూర పెట్టే సమయంలో ప్రమాదవశాత్తు ఇసుక పేరడి కూలి జగదీష్ పై పడిపోయింది. ఇసుక మేట జగదీష్ పై పడటంతో ఇసుకలో కూరుకు పోయాడు. స్థానికులు హుటా హుటినా సంఘటన ప్రాంతానికి చేరుకొని జెసిబి సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. ఇసుకను బయటకు తీసారు. జగదీష్ ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు. మృత దేహాన్ని జెసిబి సహాయంతో బయటకు తీశారు.పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకుని ప్రమాద ఘటనపై ఆరా తీశారు. మృతునికి భార్య ,సంవత్సరంన్నర పాప ఉన్నారు. ప్రస్తుతం మృతుని భార్య నిండు గర్భిణి కావడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ విభూషణరావు వెల్లడించారు.

80 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-పెందుర్తి: మండలంలోని సరిపల్లి చెక్‌పోస్టు వద్ద గంజాయిని పెందుర్తి పోలీసులు పట్టుకున్నారు. చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా జి.మాడుగుల నుంచి వస్తున్న ఎపి31 టివి 8895 స్విఫ్ట్ కారులో 80 కిలోల గంజాయి పట్టుబడింది. గంజాయితోపాటు ఒక స్విఫ్ట్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి కేసు నమోదుచేశారు.

వాలంటీర్‌పై కేసు

ప్రజాశక్తి-గొలుగొండ:తాను చెప్పినట్లు వినకపోతే ప్రభుత్వ పథకాలను నిలిపి వేస్తామని బెదిరిస్తూ విద్యార్థినిని వేధింపులకు గురి చేస్తున్న వలంటీర్‌పై కేసు నమోదైంది. గొలుగొండ ఎస్సై నారాయణరావు తెలిపిన వివరాల మేరకు... మండలంలో చోద్యం గ్రామంలో ఎం.శివరాజు(26) వలంటీర్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన డిగ్రీ చదువుతున్న విద్యార్థినిని పలుమార్లు వేధింపులకు గురి చేసేవాడు. తాను చెప్పినట్లు వినని పక్షంలో తన కుటుంబానికి అందుతున్న ప్రభుత్వ పథకాల రద్దు చేయిస్తానని వేధింపులకు గురి చేస్తున్నాడని యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వలంటీర్‌ను అదుపులో తీసుకున్నామని ఎస్సై తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

నర్సింగ్ విద్యార్థిని అదృశ్యం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలసలోని అనిట్స్ కళాశాలలో చదువుతున్న నర్సింగ్ విద్యార్థిని ఈ నెల 23వ తేదీన అదృశ్యమైనట్లు భీమిలి పోలీసులు గురువారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. విజయనగరం జిల్లా, గోపాలరాజుపురానికి చెందిన శిర శ్రావణి (20)కి త్రినాథ్‌తో సుమారు నాలుగు నెలల క్రితం వివాహమైంది. గత కొంత కాలంగా ఆమెను భర్త శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఇష్టం లేకపోయినా సరే అనిట్స్ కళాశాలలో నర్సింగ్ కోర్సులో ఆమెను భర్త జాయిన్ చేశారు. అయితే ఈ నెల 24 నుంచి ఆమె కనబడలేదు. ఈ మేరకు ఆమె తల్లి జయలక్ష్మి భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కెజిబివిలో గురువారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. జిల్లా యువజన విభాగం అధ్యక్షులు జి.మహేశ్వరరావు మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చన్నారు. న్యూఢిల్లీకి చెందిన స్కూల్ ఆఫ్ జర్నలిజం వైస్ చైర్మన్ ఎన్.నాగేశ్వరరావు మాట్లాడుతూ, రోడ్డుపై నడిచే సమయంలో ఆటలకు దూరంగా ఉండాలన్నారు. సమగ్ర శిక్ష ఎపిసి పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ, కాలి నడకన ప్రయాణం ఆరోగ్యకరమని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ గంగాకుమారి, సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు. అనంతరం రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

పద్మనాభం వాలీబాల్ జట్టుకు మూడో స్థానం

ప్రజాశక్తి -పద్మనాభం: ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ ఆటల పోటీల్లో భాగంగా పద్మనాభం పంచాయతీకి చెందిన వాలీబాల్ జట్టు గురువారం నిర్వహించిన పోటీల్లో మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. క్రీడాకారులను పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప అభినందించారు.



మూడో స్థానంలో నిలిచిన పద్మనాభం జట్టు

శారదా పీఠానికి భూసంతర్పణపై సిబిఐ విచారణ జరపాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలిలో శారదా పీఠానికి సిఎం జగన్మోహన్‌రెడ్డి ఏకంగా రూ.కోట్ల విలువైన 15 ఎకరాల ప్రభుత్వ భూమిని కారు చౌకగా కట్టబెట్టడంపై సిబిఐచే విచారణ జరిపించాలని తెలుగుశక్తి అధ్యక్షులు బివి.రామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భీమిలిలో శారదా పీఠానికి కేటాయించిన స్థలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాన్యునికి సెంటు భూమి ఇచ్చేందుకు మీనమేషాలు లెక్కిస్తున్న ఈ ప్రభుత్వం శారదా పీఠానికి ఏకంగా 15 ఎకరాల విలువైన భూమిని ఏ ప్రాతిపదికన కట్టబెట్టిందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ వరల్డ్ వైడ్ ట్రస్ట్ చైర్మన్ ఎ.ఉమాశంకరరావు, టిడిపి విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ కార్యదర్శి బి.దొరబాబు, బిసి సెల్ నాయకులు డి.పరమేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలపై పింఛనుదారుల ధర్నా



భీమిలి ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రభుత్వ పింఛనుదారులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి పింఛనుదారుల సంఘం భీమిలి తాలూకా యూనిట్ ఆధ్వర్యాన గురువారం స్థానిక ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు టి.భీమారావు మాట్లాడుతూ, గతేడాది జనవరి 1 నుంచి జులై 1వ తేదీ వరకు రెండు విడతల డిఆర్ బకాయిలు చెల్లించాలని, 11వ పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని, 12వ పిఆర్‌సి నియమించిన నేపథ్యంలో ఐఆర్ ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి నెలా 1వ తేదీ నాటికి పింఛను ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి ఎం.ఆనందరావు, కోశాధికారి పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్‌డిఓ కార్యాలయంలో సంబంధిత అధికారికి వినతిపత్రం అందజేశారు.

'జైల్లో శ్రీనివాస్ దీక్షను భగ్నం చేశారు'

ప్రజాశక్తి - ఆరిలోవ : జగన్మోహన్‌రెడ్డిపై కోడి కత్తితో దాడిచేసిన కేసులో జైలులో ఉన్న జనపల్లి శ్రీనివాసరావు బెయిల్ కోసం 7 రోజులుగా చేస్తున్న నిరాహారదీక్షను జైలు అధికారులు ఒత్తిడి చేసి భగ్నం చేశారని దళిత ఐక్యవేదిక రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ బూసి వెంకటరావు తెలిపారు. గురువారం ములాఖత్ ద్వారా జైల్లో శ్రీనును కలిసిన అనంతరం వెంకటరావు మీడియాతో మాట్లాడారు. శ్రీను ఆరోగ్యం ఆందోళనకరంగా ఉందని, నిలబడలేని స్థితిలో తోటి ఖైదీ సహాయంతో ములాఖాత్‌కు వచ్చారని తెలిపారు. బలవంతంగా నిన్నటి నుంచి జైలు ఆసుపత్రిలో సెలైన్ బాటిల్స్ ఎక్కిస్తున్నారని శ్రీను చెప్పినట్లు తెలిపారు.

స్ప్రింగ్ ఫీల్డ్ స్కూల్ వార్షికోత్సవ ఏర్పాట్లు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని కృష్ణాపురం పంచాయతీ పరిధిలో ఉన్న స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాల 20వ వార్షికోత్సవాన్ని శుక్రవారం పాఠశాలలో నిర్వహించేందుకు నిర్వాహకులు ఆలీవర్‌రాయ్ ఆధ్వర్యాన ఏర్పాట్లుచేస్తున్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని చిప్పాడ దివీస్ ఆధ్వర్యాన జివిఎంసి హైస్కూల్‌లోని 26 మంది టెన్త్ విద్యార్థులకు రూ.6,500 విలువైన స్టడీ మెటీరియల్‌ను గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో దివీస్ సంస్థ సిఎస్ఆర్ ప్రతినిధులు, హెచ్ఎం సింహాచలం, ఉపాధ్యాయులు ఎం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులు




నిర్మించిన కల్వర్టును ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకటకుమారి

సంక్షేమమే ధ్యేయం : మేయర్

ప్రజాశక్తి-సీతమ్మధార : సంక్షేమం అభివృద్దే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం పనిచేస్తోందని మేయర్ గొలగాని హరివెంకట కుమారి పేర్కొన్నారు. జివిఎంసి 43వ వార్డు పరిధి అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్డులో శ్రీనివాస్‌నగర్ బ్రహ్మం గుడి వద్ద రూ.33.50 లక్షల వ్యయంతో నిర్మించిన బాక్స్ కల్వర్టు బ్రిడ్జిని గురువారం ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, వార్డు కార్పొరేటర్ ఉషశ్రీతో కలిసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగర ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులు కల్పించడమే జివిఎంసి ప్రథమ కర్తవ్యమన్నారు.

బస్‌బే ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 24వ వార్డు పరిధి మద్దిలపాలెం సిఎంఆర్ సెంట్రల్ వద్ద రూ.41.45 లక్షలతో నిర్మించిన బస్ బే సెంటర్‌ను కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యాన ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా బస్సు బే సెంటర్లను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, 14వ వార్డు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు, ఇఇ రత్నాకర్‌రెడ్డి, ఎఇ శ్రీనివాసరావు, నాయకులు జివి.రమణి, మురళీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

పలుచోట్ల టిడిపి జయహో బిసి సదస్సులు

ప్రజాశక్తి-యంత్రాంగం

నగరంలో పలుచోట్ల టిడిపి ఆధ్వర్యాన జయహో బిసి సదస్సును గురువారం నిర్వహించారు.

గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి శ్రీరామ్ నగర్‌లో జయహెూ బీసీ సదస్సును తెలుగుదేశం ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, బీసీ సంక్షేమాన్ని వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. ప్రభుత్వ సలహాదారులుగా వందల మందిని వేసినా వారిలో ఒక్కరు కూడా బీసీ లేరని తెలిపారు. యూనివర్సిటీల్లో ఒక్క బీసీ వైస్ ఛాన్సలర్ లేరన్నారు. తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే తొలిరోజుల్లోనే బీసీల కోసం కొత్త చట్టాన్ని తెస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, విశాఖ పార్లమెంట్ టిడిపి సమన్వయకర్త ఎం.శ్రీభరత్, కార్పొరేటర్ బొమ్మిడి రమణ, జనసేన నాయకులు ప్రశాంతి, నాయకులు బొడ్డేటి విజయ్ కుమార్, మూర్తిపట్నాయక్, నారిపిన్ని సత్తిరాజు, నందవరపు సోములు, మరడ ప్రదీప్ పాల్గొన్నారు.

బిసిల సంక్షేమమే టిడిపి లక్ష్యం : వెలగపూడి

ఆరిలోవ : తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చెప్పారు. తూర్పు నియోజకవర్గం టిడిపి ఆధ్వర్యాన తోటగరువు కల్యాణమండపంలో జయహో బిసి సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పట్టాభి, ఒమ్మి సన్యాసిరావు, లావం కాశింనాయుడు, మద్దిల రామలక్ష్మి, గొలగాని మంగవేణి, బుడుమూరు గోవిందు, ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, ఒమ్మి అప్పలరాజు, గాడి సత్యం, నింగిబోతు శ్రీనివాసరావు, ముగడ రాజారావు, మూది అప్పారావు, రాగతి అచ్యుతరావు పాల్గొన్నారు.

లెక్చర్ సిరీస్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యాన నిర్వహించే లెక్చర్ సిరీస్ పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు.

డిఎస్‌సిపై బొత్స మాటలు ఏమయ్యాయి : డివైఎఫ్‌ఐ

ప్రజాశక్తి-సీతమ్మధార : సంక్రాంతి తర్వాత మెగా డిఎస్సీ ప్రకటిస్తామని మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పిన మాటలు ఏమయ్యాయని డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాజు ప్రశ్నించారు. డిఎస్‌సిపై ప్రభుత్వ నయవంచనకు నిరసనగా విజయవాడలో ఈ నెల 27వ తేదీన చేపట్టే నిరాహార దీక్షలకు సంబంధించిన పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో డిఎస్‌సి నోటిఫికేషన్ కోసం నిరుద్యోగులు నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. డివైఎఫ్‌ఐ ఆధ్వర్యాన డిఎస్‌సి అభ్యర్థులు ఈ నెలలో ఒకసారి మంత్రి బొత్స సత్యనారాయణ కార్యాలయం వద్ద, మరో సారి సిఎం క్యాంప్ కార్యాలయం వద్ద ఆందోళన చేయడంతో సంక్రాంతి తర్వాత మెగా డిఎస్‌సి ప్రకటిస్తామని చెప్పారని గుర్తుచేశారు. సంక్రాంతి పోయినా ఇంత వరకు డిఎస్‌సి ఊసే లేదన్నారు. నిరుద్యోగ అభ్యర్థులను భ్రమలో ఉంచాలని మోసపూరిత హామీలు ఇవ్వడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. డిఎస్‌సి కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ అభ్యర్థుల జీవితాలతో చెలగాటం ఆడవద్దన్నారు. సంవత్సరాల కొలది కుటుంబాలకు దూరంగా ఇతర ప్రాంతాలలో కోచింగ్ తీసుకుంటూ మనోవేదనతో అభ్యర్థులు సతమతం అవుతున్నారన్నారు. జనవరి చివరి లోపల డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే డిఎస్‌సి అభ్యర్థులతో కలిసి విజయవాడలో దీక్షలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ అక్కయ్యపాలెం జోన్ అధ్యక్షులు కోటి, సభ్యులు ఆది తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డివైఎఫ్‌ఐ నాయకులు

మురళీనగర్‌లో వరుణ్ బజాజ్ త్రీవీలర్ షోరూమ్



త్రీవీలర్ షోరూమ్ ప్రారంభంలో రాజారత్నం, ప్రభుకిశోర్ తదితరులు

ప్రజాశక్తి-మాధవధార : బజాజ్ 3 వీలర్స్ అధీకృత డీలర్ వరుణ్ బజాజ్ సరికొత్త షోరూం, వర్క్‌షాప్‌ను మురళీనగర్‌లో గురువారం డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ జిసి.రాజారత్నం ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా బజాజ్ ఆటో లిమిటెడ్, ఐబియు బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ గౌరవ్ రాథోర్, వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిషోర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుకిషోర్ మాట్లాడుతూ, మురళీనగర్ కస్టమర్లకు చేరువలో ఆధునిక హంగులతో సరికొత్త బజాజ్ 3-వీలర్ షోరూం, వర్కుషాప్ ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. బజాజ్ 3- వీలర్ రంగంలో మొట్టమొదటి సారిగా ఎలక్ట్రిక్ ఆటోలను ఆవిష్కరించడం ఆనందదాయకంగా ఉందని తెలిపారు. బజాజ్ వారి సరికొత్త మ్యాక్సిమా ఎక్స్ ఎల్ కార్గో ఇ-టెక్ 9.0, ఎక్స్‌ఎల్ కార్గో ఇ-టెక్ 12.0, ఎలక్ట్రిక్ 3 వీలర్లను ఆవిష్కరించారు. సరికొత్త ఎలక్ట్రిక్ ఆటోలలో ఐపి67 రేటెడ్ అడ్వాన్స్‌డ్ లై-అయాన్ బ్యాటరీ, టూ స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్ మిషన్, సమర్ధవంతమైన పర్మినెంట్ మ్యాగ్నెట్ సిక్రోనస్ (పిఎంఎస్) మోటార్‌ను పొందుపరిచినట్లు వివరించారు. బజాజ్ మ్యాక్సిమా ఎక్స్ ఎల్ కార్గో ఇ-టెక్ 9.0, ఎక్స్ ఎల్ కార్గో ఇ-టెక్ 12.0లలో 11.8 కెడబ్ల్యూహెచ్ బ్యాటరీ, 149 కిలోమీటర్ రేంజ్, 183 కిలోమీటర్ రేంజ్ మైలేజ్‌ను ఇస్తుందని తెలిపారు. దీని ఎక్స్ షో రూమ్ ధర రూ.3,58,426 నుంచి రూ.3.97,833గా నిర్ణయించారని పేర్కొన్నారు.

డేటా ఆధారంగా లోపాలను సరిదిద్దుకోవాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రపంచ దేశాలలో మనం ఎక్కడ వెనకబడ్డామో డేటా ఆధారంగా గ్రహించి లోపాలను సరిదిద్దుకోవాలని ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డివిఎస్ఎస్ సోమయాజులు సూచించారు. పౌర గ్రంథాలయంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ సంయుక్తంగా ఫాలో ఆఫ్ గ్లోబల్ ర్యాంకింగ్ ఆఫ్ ఇండియన్ డెమోక్రసీ అనే అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నార్వే, డెన్మార్క్ వంటి చిన్న దేశాలు ఎప్పుడూ ర్యాంకుల్లో ముందుంటాయని తెలిపారు. దేశానికి రాష్ట్రానికి యువతే ముఖ్యమని, యువత బాగా చదువుకుని మంచి స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ ఎ.రాజేంద్రప్రసాద్, ఎయు జర్నలిజం విభాగం ఆచార్యులు డివిఆర్ మూర్తి, ఎ.ప్రసన్నకుమార్, గ్రంథాలయం కార్యదర్శి డిఎస్.వర్మ, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గాడితప్పిన విద్యావ్యవస్థపై చర్చాగోష్టి

ప్రజాశక్తి-సీతమ్మధార : జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షతన పౌర గ్రంథాలయంలో గాడి తప్పిన విద్యా వ్యవస్థపై చర్చా గోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో విద్యా వ్యవస్థ గాడి తప్పిందని, విశ్వవిద్యాలయాలు రాజకీయ కేంద్రాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మాతృభాషలోనే విద్యాబోధన జరగాలన్నారు. కేరళ, ఢిల్లీ, గుజరాత్ రాష్ట్రాలు విద్యారంగంలో అగ్రబాగాన ఉన్నాయని తెలిపారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పూర్వ ఇన్‌ఛార్జి చైర్మన్ ప్రొఫెసర్ కెఎస్.చలం మాట్లాడుతూ, ప్రపంచంలో భారతదేశంలో తప్ప మిగిలిన అన్ని దేశాలలో ప్రాథమిక విద్యను ఆయా ప్రభుత్వాలే అందిస్తున్నాయన్నారు. విద్యారంగంలో ఉన్న అసమానతలే వర్గసమాజాన్ని ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయ నియామకాలు లేక ఆంధ్రప్రదేశ్‌లో విద్యా ప్రమాణాలు ఘోరంగా పడిపోయాయన్నారు. సరైన ప్రణాళిక లేకుండా మూడు, నాలుగు, ఐదు తరగతుల పిల్లలను ఉన్నత పాఠశాలలకు పంపడం వల్ల లక్షలాదిమంది విద్యార్థులు విద్యకు దూరమయ్యారని పేర్కొన్నారు. టోఫెల్, ఐబీ, సీబీఎస్సీ, బైజూస్ లాంటి ప్రయోగాలు చేస్తూ విద్యార్థులలో అయోమయాన్ని రేకెత్తిస్తున్నారని వివరించారు. భారతదేశ అక్షరాస్యతలో ఆంధ్రప్రదేశ్ 30వ స్థానంలో ఉందన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.ఉమామహేశ్వరరావు ప్రసంగిస్తూ ప్రైవేటు విద్యాసంస్థలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కు ఫీజు రీయింబర్స్‌మెంట్ అవకాశం రద్దు చేయడంతో పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యారని వివరించారు. రాష్ట్రంలో విద్య వ్యాపారంగా మారిందని, 80 శాతం బిఇడి కళాశాలలు, లా కళాశాలలు, బోగస్ విద్యాసంస్థలుగా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయ దూర విద్య కేంద్రం పూర్వ సంచాలకులు ప్రొఫెసర్ పి.హరిప్రకాష్ ప్రసంగిస్తూ బోర్డ్ ఆఫ్ స్టడీస్, పాలకమండలి, సెనేట్ నిర్ణయాలు లేకుండానే విశ్వవిద్యాలయాల ఉపకులపతులు బోధన, సిలబస్‌లు, కోర్సులకు సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడం వల్ల విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయని తెలిపారు. కృష్ణ యూనివర్సిటీ పూర్వ ఉప కులపతి సుంకర రామకృష్ణ ప్రసంగిస్తూ రాజకీయ నేతల కబంధహస్తాలలో విద్యాసంస్థలు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం మానవ వనరుల మేనేజ్‌మెంట్ విభాగ పూర్వ ఆచార్యులు కె.జాన్ సామాజిక కార్యకర్త నర్రా సీతామహాలక్ష్మి తదితరులు ప్రసంగించారు.

గాజువాకలో ఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి-గాజువాక: భోజన ప్రియులకు నోరూరించే రుచికరమైన ఆహార పదార్థాలతో గాజువాక గ్రీన్ ఆపిల్ హోటల్‌లో అరేబియన్ మండీ పేరుతో ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేస్తున్నట్లు హోటల్ జనరల్ మేనేజర్ సెబాస్టియన్ ఏజె తెలిపారు. హోటల్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, అన్ని వర్గాలకు నచ్చేలా విభిన్న రుచులతో, పసందైన వంటకాలతో నెలరోజుల పాటు ఫెస్టివల్ కొనసాగుతుందని చెప్పారు. అంతా ఒకే చోట కూర్చొని మండీ ఆహారాన్ని భుజించేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. కార్యక్రమంలో చెఫ్‌లు ఎస్‌కె బారిక్, సయ్యద్ గుల్జార్, ఎస్‌కె నయీముద్దీన్, అసిస్టెంట్ ఇన్చార్జ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.



వీసీకి శుభాకాంక్షలు తెలుపుతున్న కాయల

ఎయు విసిని కలిసిన కాయల

ప్రజాశక్తి-సీతమ్మధార : ఎయు ఉపకులపతిగా రెండో సారి నియమితులైన ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మారిటైమ్ బోర్డ్ చైర్మన్ కాయల వెంకటరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి, సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రసాద్‌రెడ్డిని మరోసారి నియమించడం చాలా సంతోషకరమన్నారు.

రైల్వే న్యూకాలనీలో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ పరిధి ఎన్జీజీవోస్ కాలనీ, రైల్వే న్యూకాలనీ, కొబ్బరితోటలో గురువారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరాలను డిఎం అండ్ హెచ్ఒ పి.జగదీశ్వరరావు సందర్శించి జగనన్న ఆరోగ్య సురక్ష ఫోల్డర్, కేస్ షీట్‌లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. జూన్ వరకు నిర్వహించే ఈ శిబిరాల్లో స్పెషలిస్ట్ డాక్టర్లు అందించే సేవలను ప్రజలందరూ వినియోగించు కోవాలని కోరారు.

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఎయు విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు రచించిన సోషిలాజికల్ పర్‌స్పెక్టివ్స్ ఆన్ టీచర్ ఎడ్యుకేషన్ పుస్తకాన్ని వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. వర్తమాన సమాజానికి ఉపయుక్తంగా రాశారంటూ వీసీ అభినందించారు.

అధిక లోడుతో వెళ్తున్న లారీల అడ్డగింత

ప్రజాశక్తి- మునగపాక

పరిమితికి మించి అధిక లోడుతో వెళుతున్న లారీలను గురువారం స్థానిక మెయిన్ రోడ్డుపై అఖిలపక్ష నాయకులు అడ్డుకొని ఆందోళన చేపట్టారు. అధిక లోడుతో వెళ్తున్న భారీ వాహనాలపై తక్షణం చర్యలు చేపట్టాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మొల్లేటి సత్యనారాయణ, గ్రామ రైతు సంఘం అధ్యక్షులు ఆడారి మహేష్, పిఎసిఎస్ అధ్యక్షులు కోనపల్లి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రమాదాలకు నిలయంగా మారిన అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు మార్గంపై 50 టన్నుల నుండి 60 టన్నుల వరకు క్వారీ రాళ్లను తీసుకెళుతున్న లారీలు ప్రయాణికులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే రోడ్డు మార్గం పూర్తిగా శిథిలం కావడం తద్వారా గుంతలు ఏర్పడటంతో లారీలపై ఉన్న రాళ్లు వాహన దారులపై పడే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఇటీవల నాగులాపల్లి జేఎంజె స్కూల్ సమీపంలో పెద్ద రాయి లారీ నుండి జారీ పడటంతో పెను ప్రమాదం తప్పిందని వాపోయారు. అనకాపల్లి బైపాస్ జంక్షన్‌లో హెచ్చరిక బోర్డులు పెట్టిన వాటిని బేఖాతరు చేస్తూ లారీలు యథేచ్ఛగా అధిక లోడుతో తిరుగుతున్నాయని తెలిపారు. వాహనదారులపై పోలీసులు చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమన్నారు. సంబంధిత అధికారులు వచ్చి సమస్య పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని భైఠాయించారు. ట్రాఫిక్ స్తంభించి పోవడంతో పోలీసులు కలుగజేసుకొని వాహన యజమానులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆడారి లక్ష్మణరావు, పెంటకోట ఆదినారాయణ నాయుడు, జనసేన నాయకులు సూరిశెట్టి అప్పలనాయుడు, మల్ల రామ జగన్నాథం, దాడి వీరబాబు, దొడ్డి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


మెయిన్ రోడ్డుపై ఆందోళన చేస్తున్న దృశ్యం


శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులు

టెన్నికాయిట్ శిక్షణ శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి -అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టెన్నికాయిట్ జాతీయ పోటీలలో పాల్గొనే బాల బాలికల జట్ల శిక్షణ శిబిరం గురువారం జీవీఎంసీ గవరపాలెం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జీవీఎంసీ కార్పొరేటర్ పీలా లక్ష్మీ సౌజన్య రాంబాబు ప్రారంభించారు. జాతీయ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు బి.చంటిబాబు, పవన్ కుమార్, ఉపేంద్ర, రామకృష్ణ, వేణు చరణ్, పి జగదీష్, బాలికలు అలేఖ్య, సుప్రియ, మౌనిక, జయశ్రీ, బంగారమ్మ, జ్యోతికలు 2024 ఫిబ్రవరి 2 వరకు శిక్ష శిబిరంలో పాల్గొంటారు. అనంతరం రాజస్థాన్ రాష్ట్రం మహవీర్ జిల్లాలో 2024 ఫిబ్రవరి 6 నుండి 10 వరకు జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని ఆంధ్ర ప్రదేశ్ టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేవిఎన్‌వి సత్యనారాయణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు పి రమణరావు, శిక్షణ శిబిరం కోచ్‌లు జి రాజు, ఎల్. త్రిమూర్తులు, ఎన్‌సిసి ఆఫీసర్ జనార్దన్, వ్యాయామ ఉపాధ్యాయిని పూర్ణిమ, పాల్గొన్నారు.


ఉత్తమ అవార్డు అందుకుంటున్న లక్ష్మి

మొగలిపురం బిఎల్ఒకు ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని మొగలిపురం పోలింగ్ స్టేషన్ నెంబర్ 208కి చెందిన బిఎల్ఓ కెవిజె.లక్ష్మికి ఉత్తమ అవార్డు లభించినట్లు సచివాలయం కన్వీనర్ ఎడ్ల నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి బెస్ట్ అవార్డు అందుకున్నందుకు అభినందించారు. ఈ అవార్డు పెందుర్తి నియోజకవర్గం ఎన్నికల అధికారి శేష శైలజ చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. లక్ష్మికి పలువురు గ్రామస్తులు అభినందించారు.

వాడ్రాపల్లిలో గ్రామసభ

ప్రజాశక్తి -మునగపాక : మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో గల సచివాలయంలో గురువారం సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అధ్యక్షతన గ్రామసభ జరిగింది. గ్రామ అభివృద్ధి, ఎన్ఆర్ఈజీఎస్ పనితీరు, శానిటేషన్, జగనన్న హౌసింగ్ పట్టాలపై చర్చించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. హౌసింగ్ నిర్మాణంలో లోటుపాట్లు ఉంటే తెలియజేయాలని సూచించారు. జగనన్న సంక్షేమ పథకాలు అందరికీ అంతే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

టిటిడి ఇఒ ధర్మారెడ్డిని డిస్మిస్ చేయాలి


ప్రజాశక్తి -అనకాపల్లి

తిరుమల తిరుపతి దేవస్థానం ఇఒ ధర్మారెడ్డిని వెంటనే డిస్మిస్ చేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అక్రమ ఆస్తుల కేసులలో శిక్ష తప్పదని భావించిన జగన్ రెడ్డి న్యాయ వ్యవస్థలను కూడా మేనేజ్ చేయాలని కుట్రలు చేస్తున్నారని, ఇందులో భాగంగానే ఏపీ హైకోర్టులో కీలక న్యాయమూర్తికి తన బినామీలైన టిటిడి ఈవో ధర్మారెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలను వినియోగించారని ఆరోపించారు. పలు అవినీతి పనులన్నింటికి టీటీడీ ఈవో ధర్మారెడ్డిని వినియోగిస్తున్నారని, అందుకే అతనికి అర్హత లేకపోయినా సీనియర్ ఐఎఎస్ పోస్టులో నియమించాడని విమర్శించారు. ఈవోగా ధర్మారెడ్డి ఆలయ పవిత్రతను దెబ్బతీస్తున్నారని ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత నాయకులు ఆడారి కిషోర్ కుమార్, రాష్ట్ర పెన్షనర్ అసోసియేషన్ కార్యదర్శి బుద్ద కాశి, నోబెల్ టీచర్స్ జిల్లా గౌరవ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సాగు పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-రాంబిల్లి

మండలంలోని లాలంకోడూరు పంచాయతీ శివారు రామచంద్ర పురంలో ఎన్నో ఏళ్ళ కాలంగా సాగులో ఉన్న పేద భూములకు గురువారం ఎలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తిరాజు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పేద భూములకు పట్టాలు పంపిణీ చేయడం తాను చూడలేదన్నారు. గడప, గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన తనకు తమ సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇప్పించాలని కోరారని, దీంతో పట్టాలు పంపిణీకి చర్యలు తీసుకున్నానని చెప్పారు. ఏళ్ళ కాలంగా సాగులో ఉన్న సుమారు 17 మంది రైతులకు 17.65 ఎకరాలకు సంబంధించి పట్టాలు అందించినట్లు తెలిపారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఈ ప్రాంతంలో సుమారు 535 ఎకరాల్లో సాగులో ఉన్న రైతులకు పట్టాలు అందించామని, మళ్ళీ జగన్మోహన్‌రెడ్డి పట్టాలిచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ, జడ్పీటీసీ సభ్యులు ధూళి నాగరాజు, తహసీల్దార్ పి.భాగ్యవతి, వైసీపీ మండల కన్వీనర్ పి.కిషోర్, మాజీ కన్వీనర్ జి.శ్రీనుబాబు, నాయకులు డిఎస్ఎన్ రాజు, సర్పంచ్ లాలం రమణమూర్తి, ఉప సర్పంచ్ రుత్తల గుణాకర్, వార్డు సభ్యులు వెంకటసత్య, పలువురు ప్రజా ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.



విజయ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జాతీయ ప్రతిభ పురస్కారానికి విజయ్ ఎంపిక

ప్రజాశక్తి -కశింకోట : కశింకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి తరగతి చదువుతున్న సి హెచ్.శ్యామ్‌విజయ్ జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంఆర్‌వి.అప్పారావు గురువారం తెలిపారు. ఈ పురస్కారం కింద విజయ్‌కు ప్రతి ఏటా రూ.12,500 5 సంవత్సరాల పాటు ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. విజయ్‌ను ఉపాధ్యాయులు ఆచంట నాగేశ్వరరావు, రవి, ప్రభాకర్, రామారావు, ప్రసాద్, ఆనంద్, పాఠశాల కమిటీ ఛైర్మన్ మేరీ సుజాత తదితరులు అభినందించారు.

గ్రామాల్లో తీర్థ మహోత్సవాలు

అంకుపాలెంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం


మహిళా కబడ్డీ జట్టుతో గ్రామస్తులు

ప్రజాశక్తి-చోడవరం

మండలంలో అంకుపాలెం గ్రామంలో దుర్గాంబిక అమ్మవారి తీర్థ మహోత్సవం గురువారం ప్రారంభమైంది. ఈనెల 27వ తేదీ వరకు మూడు రోజులపాటు ఈ తీర్థం జరగనున్నది. ఈ సందర్భంగా మహిళల, పురుషుల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలుపొందిన మహిళా జట్లకు మొదటి బహుమతి రూ.50వేలు, రెండవ బహుమతి రూ.40వేలు, మూడవ బహుమతి రూ.30వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు అందించనున్నారు. పురుషుల కబడ్డీ జట్టుకు మొదటి బహుమతి రూ.30వేలు, రెండవ బహుమతి రూ.20వేలు, మూడో బహుమతి రూ.15వేలు, నాలుగో బహుమతి రూ.10వేలు ఇవ్వనున్నారు. మూడు రోజులపాటు ఎడ్ల బండి, గుర్రపు పందాలు ఏర్పాటు చేశారు. రాష్ట్రస్థాయిలో పేరొందిన కళాకారులు చే ఈవెంట్స్ నిర్వహించడానికి కమిటీ ఏర్పాట్లు చేసింది. కబడ్డీ పోటీలను తిలకించడానికి పెద్ద ఎత్తున ప్రజలు రానుండడంతో స్థానిక సిఐ డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.


మరిడిమాంబ తీర్థం

దేవరాపల్లి : మండలంలోని మామిడిపల్లి గ్రామంలో గురువారం మరిడిమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎడ్ల పరుగు పందెం నిర్వహించారు. ఈ ప్రదర్శనలో 15 ఎడ్ల బళ్ళు పాల్గొనగా అందులో మొదటి బహుమతి చుక్కపల్లికి చెందిన అడ్డిపల్లి పాలవెల్లికి రూ.10వేలు, రెండవ బహుమతి చుక్కపల్లికి చెందిన మురుకుతి హరికృష్ణ రూ.8000, మూడో బహుమతి నరసయ్యపేటకి చెందిన ముమ్మిడి రామకృష్ణ రూ.6000, నాలుగో బహుమతి కేజే పురంకు చెందిన కొయిలాడ మోహన్ రూ.4000, ఐదువ బహుమతి దేవరపల్లికి చెందిన వారధి భరద్వాజ్ రూ.2000, ఆరో బహుమతి దామనపల్లికి చెందిన కుర్రు జగదీష్ రూ.1000 చొప్పున అందజేశారు. ఈ బహుమతులను జడ్పిటిసి కర్రీ సత్యం, వైసిపి మండల అధ్యక్షులు బూరె బాబురావు, మండల యూత్ అధ్యక్షులు కర్రి సూర్య నాయుడు, ఎంపీటీసీ పంచాద సింహాచలం నాయుడు గ్రామ పెద్దలు చేతుల మీదుగా అందజేశారు. పండుగ సందర్భంగా గ్రామంలో అమ్మవారి ఊరేగింపుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, బాణాసంచా, డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమాలు నిర్వహించారు.


ఎడ్ల పరుగు పందెం పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పిటిసి సత్యం

టిడిపి నేతలను కలిసిన దిలీప్ చక్రవర్తి

ప్రజాశక్తి - పరవాడ : పరవాడ మండలం తెలుగుదేశం పార్టీ నాయకులను గురువారం భైరా ఫౌండేషన్ అధినేత భైరా దిలీప్ చక్రవర్తి కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, నారా లోకేష్ ఆశీసులతో అనకాపల్లి ఎంపీగా పోటీ చేస్తానని తెలిపారు. పరవాడ మండలం స్థానిక సమస్యలు, ఫార్మా, కాలేజ్, ఉద్యోగ అవకాశాలు, ఉపాధి, ప్రజలు అందరికీ మౌళిక జీవన సదుపాయాలు కలగ చేయటానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు పైల జగన్నాధరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి అట్ట సన్యాసి అప్పారావు, మండల టిడిపి అధ్యక్షులు వియ్యపు చిన్నా, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు బొండా సన్ని దేముడు, కుంద్రపు శ్రీరామ్‌మూర్తి, గొర్లె కనకారావు, ఒమ్మి వెంకటరావు, ఆర్లిల్లి రవి, సురాడ బంగార్రాజు, బొండా తాతారావు, ఇందల కొండలరావు, సారిపల్లి జోగినాయుడు, రాయవరపు దేముడు పాల్గొన్నారు.


దిలీప్ చక్రవర్తికి పూలమాల వేసిన టిడిపి నాయకులు

గ్రావెల్ తవ్వకాలను అరికట్టాలి

అటవీభూమిలో అనధికార రోడ్డుపై ఫిర్యాదు

ప్రజాశక్తి రాంబిల్లి

మండలంలోని వెంకయ్యపాలెం గ్రామంలో సముద్ర తీర ప్రాంతం అటవీశాఖ పరిధిలో ఫారెస్టు భూమిని ఆక్రమించుకున్న భూకబ్జాదారులు సమీపంలో ఉన్న రాంబిల్లి రెవెన్యూ రామకొండ గ్రావెల్ తవ్వి సిఆర్‌జెడ్ పరిధిలోవున్న ఈ ఫారెస్టు భూమిలో అనధికారికంగా రోడ్డు వేస్తున్నారని స్థానికులు గురువారం అనకాపల్లి ఆర్‌డిఒకు ఫిర్యాదు చేశారు. రామకొండ వద్ద గ్రావెల్ తవ్వడానికి కూడా అధికారికంగా రెవెన్యూ అధికారులు ఏ విధమైన అనుమతులు ఇవ్వలేదని పేర్కొన్నారు. స్థానిక విఆర్ఓతో పాటు రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తిపడి యథేచ్ఛగా ఆక్రమ గ్రావెల్ దందా కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు. ఈ గ్రావెల్ తవ్వకాలపై పలుమార్లు విఆర్ఒకు, మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా వారు ఏ విధమైన చర్యలు చేపట్టలేదని తెలిపారు. ప్రభుత్వ ఇళ్ళ స్థలాలకు అని నమ్మబలికి ఆ ముసుగులో సగం గ్రావెల్ స్థానిక పరిశ్రమలకు, మరికొంత సిఆర్‌జెడ్ పరిధిలో వున్న ఫారెస్టులో భూకబ్జాదారులు ప్రయోజనార్థం అనధికారిక రోడ్డు వేయడానికి గ్రావెల్ తోలుతున్నారని ఆరోపించారు. ఈ అడ్డగోలుగా గ్రావెల్ తరలించడంతో తమ గ్రామం ద్వారా వెల్తున్న కొత్తపట్నం, పూడిమడక రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. ఈ గ్రావెల్ దందాపై రెవెన్యూ వాళ్ళకు ఫిర్యాదు చేస్తే పోలీసులకు చేయాలని, పోలీసులకు చెబితే రెవెన్యూ వాళ్ళకు చేయమని చెబుతున్నారని తెలిపారు. గ్రావెల్ మాఫియాకు, సముద్రపు ఇసుక మాఫియాకు అవకాశం ఇస్తున్నారన్నారు. సిఆర్‌జెడ్, అటవీ పరిధిలోకి అనధికారికంగా గ్రావెల్ తరలింపును అడ్డుకోవాలని, రోడ్డు నిర్మాణం ఆపాలని కోరారు. పైన పేర్కొన అంశాలపై సమగ్ర విచారణ జరిపి సకాలంలో చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేకుంటే లోకాయుక్త, ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించాల్సివుంటుందని స్పష్టం చేశారు.



వినతి ఇస్తున్న వెంకయ్యపాలెం గ్రామస్తులు

బొగ్గు లారీ బోల్తా

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని సోమునాయుడు పాలెం గ్రామ సమీపంలో ఉన్న వంతెన వద్ద గురువారం తెల్లవారుజామున బొగ్గు లారీ బోల్తా పడింది. ఆ సమయంలో ఈ రహదారిలో ప్రజలు ప్రయాణించకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. హిందుజా విద్యుత్ కేంద్రానికి అధిక లోడులతో రాత్రి పగలు అనే తేడా లేకుండా బొగ్గు రవాణా జరుగుతుంది. దీంతో డ్రైవర్లకు విశ్రాంతి లేకుండా వాహనాలు నడపడంతో పాటు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ బొగ్గు లారీల వలన రహదారులు ధ్వంసం కావడమే కాకుండా రహదారి వెంబడి బొగ్గుతో నల్లటి పొరతో నిండిపోతుంది. ఈ బొగ్గు లారీల వలన ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గతంలో పరవాడ తాసిల్దార్ కార్యాలయం సమీపంలో గొర్రెల మందపై బొగ్గులారీ దూసుకు వెళ్లిన సందర్భంలో అనేక గొర్రెలు మృత్యువాత పడ్డాయి. అయినప్పటికీ రోడ్డు రవాణా శాఖ వారు గాని, ఆర్ అండ్ బి అధికారులు కానీ చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిర్లక్ష్యంగా ప్రయాణిస్తున్న బొగ్గు లారీలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



బోల్తా పడిన బొగ్గు లారీ

టిడిపి ఇంటిగ్రేటెడ్ శిక్షణ తరగతులు

ప్రజాశక్తి- కశింకోట : తెలుగుదేశం పార్టీ ఇంటిగ్రేటెడ్ శిక్షణ తరగతులుకశింకోటలో నూకాంబిక ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించారు. ఓటరు వెరిఫికేషన్, భవిష్యత్తు గ్యారెంటీ వంటి వాటిపై బూత్ యూనిట్ క్లస్టర్ ఇన్‌ఛార్జులకు, కుటుంబ సాధికార సారథులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ ఆసరా పేరుతో 34లక్షల మంది డ్వాక్రా మహిళలకు జగన్ రెడ్డి టోకరా పెట్టారన్నారు. జగన్ రెడ్డిని నమ్ముకొని చట్ట విరుద్ధంగా దొంగ ఓట్లను నమోదు చేసిన అధికారులు జైలుకు వెళ్లడం ఖాయమని హెచ్చరించారు. టిడిపి యువ నాయకులు దాడి రత్నాకర్ మాట్లాడుతూ సంస్థాగతంగా బలమైన పార్టీ తెలుగుదేశం అని చెప్పారు. ఐదేళ్ల వైసిపి రాక్షస, అవినీతి పాలనపై సైనికుల్లా పోరాడి ఆ పార్టీకి చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పీలా శ్రీకాంత్, కాయల మురళి, వేగి గోపికృష్ణ, ఉగ్గిన రమణమూర్తి, పెంటకోట రాము, సిద్దిరెడ్డి శ్రీనివాసరావు, కాంగ్రెస్ సతీష్, నైనంశెట్టి రమణారావు, తాకాసీ కృష్ణ, ట్రైనర్ సురేశ్, విజయ్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ సంత బయలు వద్ద వైఎస్ఆర్ ఆసరా నాల్గోవ విడత చెక్కులను పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ చేతుల మీదుగా డ్వాక్రా మహిళలకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెందుర్తి నియోజకవర్గంలో 2614 ఎస్‌హెచ్‌జిఎస్‌లో ఉన్న 27,469 మంది పెద మహిళలకు 4వ విడతగా రూ.105.81 కోట్లు వైఎస్ఆర్ ఆసరా కింద ఇవ్వగా, ఇందులో పరవాడ మండలానికి సంబంధించి 1143 మంది మహిళలకు రూ.12.92 కోట్ల అందించినట్లు చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదిగి స్థిరపడేందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్ అనేక పథకాలు అమలు చేస్తున్నారని, మరోసారి ఆయన్ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మి శ్రీనివాసరావు, పరవాడ సర్పంచ్ సిరిపరపు అప్పల నాయుడు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, వైసిపి నాయకులు చుక్క రామునాయుడు, కోన రామారావు, వెన్నెల సన్యాసిరావు, ఎంపీడీఓ హేమ సుందరరావు, డ్వాక్రా ఎపిఎం కనకమ్మ, సర్పంచ్‌లు, సీతారామయ్య, గొర్లి గోపి అమ్ములు, పూజా శేఖర్, బొండా కనకారావు, రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నదియా, బొంది ఆచ్చిబాబు, మడక సూరిబాబు, బురద రాజు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి సచివాలయం పరిధిలో రావలమ్మపాలెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం స్థానిక సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న, సన్న కారు రైతులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వరికి మంచి మద్దతు ధరను కల్పిస్తుందని, రైతులు తమ ధాన్యాన్ని దళారులకు ఇవ్వకుండా రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, మాజీ సర్పంచ్ సబ్బవరపు దేవుడుబాబు, ఉప సర్పంచ్ గొర్లి అప్పారావు, సచివాలయం కన్వీనర్ గొర్లి ఎర్రినాయుడు, గ్రామ వ్యవసాయ సహాయకులు శ్రావణి, జానకి, పిఏసిఎస్ సిబ్బంది దేముడుబాబు, రామకృష్ణ వార్డ్ మెంబర్లు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ ప్రారంభం

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం పట్టణానికి తాగునీరు అందించేందుకు రూ.12 కోట్ల 80 లక్షలతో ఏర్పాటు చేసిన పైపులైను స్థానిక కోణం గెస్ట్ హౌస్ వద్ద స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ గురువారం ప్రారంభించారు. స్వయంగా బిందుల్లో నీరు పట్టి మహిళలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోడవరం నియోజకవర్గంలో జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.150 కోట్లతో తాగునీటి పథకాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర మొత్తం మీద జల్ జీవన్ మిషన్ ద్వారా చోడవరం నియోజకవర్గానికే అధిక నిధులు తెచ్చినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తనకు మరో మారు అవకాశం ఇవ్వాలని అభ్యర్థించారు. అనంతరం ఎడ్ల వీధి సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్యామసుందర్, ఎంపీపీ గాడి కాసు, డీసీఎంహెచ్ చైర్మన్ పల్లా నర్సింగరావు, ఏఎంసీ చైర్మన్ ఏడువక సత్యారావు, చోడవరం బార్ కౌన్సిల్ అధ్యక్షులు కాండ్రేగుల డేవిడ్, వైస్ ఎంపీపీ బైన కుమారి, స్థానిక సర్పంచ్ బండి నూకాలమ్మ, వైసిపి మండల అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు, వార్డు సభ్యులు ఓరుగంటి నెహ్రూ నాగమణి, దేవరపల్లి సత్య, శివాలయం కమిటీ చైర్మన్ జి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-దేవరాపల్లి :మండల కేంద్రంలో సుమారు రూ.2 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న ఎంపిడిఒ కార్యాలయ పనులను వైసిపి ఉపాధ్యక్షులు కిలపర్తి భాస్కరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ప్రత్యేక చొరవతో అన్ని హంగులతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఈ భవనానికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడుకు భాస్కరరావు కృతజ్ఞతలు తెలిపారు.

అవినీతి తోటలో విరబూసిన 'రోజా'

- పర్యాటక మంత్రిపై అనిత ఆరోపణ

ప్రజాశక్తి-కలెక్టరేట్ : అవినీతి తోటలో విరబూసిన పుష్పం రాష్ట్ర పర్యాటక మంత్రి ఆర్‌కె.రోజా అని తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆరోపించారు. గురువారం జిల్లా టిడిపి కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, నగిరి మున్సిపల్ చైర్మన్ పదవిని వేలంలో పెట్టి, దళిత మహిళా కౌన్సిలర్‌కు మున్సిపల్ చైర్మన్‌ను చేస్తానని నమ్మబలికి రూ.70 లక్షలు డిమాండ్ చేసి, రూ.40 లక్షలు తీసుకుందని ఆరోపించారు. ప్యాకేజీలు, పైసాలకు ఆశపడి వైసిపిలోకి చేరిందే తప్ప, రోజాకు ప్రజా సేవ చేయాలన్న యావ లేదన్నారు. నగిరి నియోజకవర్గంలో మండలాలకు బినామీని పెట్టి, మంత్రిగా అక్రమ వసూళ్లతో 9 నెలల్లోనే వందల కోట్లకు అధిపతి అయిందన్నారు. జగన్ పుట్టినరోజు పేరు చెప్పి రూ.29 కోట్లు కొట్టేసిందన్నారు. ఆర్‌డిఒ, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సమస్యలు సృష్టించడం, వాటి పరిష్కారం పేరుతో అక్రమాలకు పాల్పడడం, గ్రావెల్ దందాలు పరిపాటిగా మారిందన్నారు. ఆర్ టాక్స్ కట్టకుండా నగరిలో పనులు జరగడం లేదంటే, అక్కడ అవినీతి, అక్రమాలు ఏ స్థాయికి చేరాయో స్పష్టమౌతోందన్నారు. తిరుమల వెంకన్న దర్శనాల పేరుతో నెలకు రూ.20 లక్షలను మంత్రి రోజా సంపాదిస్తోందన్నారు. జగన్ అధికారంలోకి రావడానికి కారణమైన షర్మిలనే మరిచిపోవడం వారి నైజానికి నిదర్శనమన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి- కలెక్టరేట్ : జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని, నగరానికి చేరువగా స్థలాలు కేటాయించాలని, 60:40 లబ్ధిదారుని వాటాను సవరించాలని, ఈ ఏడాది అక్రిడిటేషన్ లేనివారికి న్యాయం చేయాలని విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ కార్యవర్గ సమావేశం తీర్మానించింది. గురువారం సొసైటీ అధ్యక్షులు బి.రవికాంత్ అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వం ఇళ్ల స్థలాల జిఒలో పేర్కొన్న 60:40 నిష్పత్తిని సవరించాలని, లబ్ధిదారుల వాటాను వాయిదాల పద్ధతిలో చెల్లించే వెసులుబాటు కల్పించాలని కోరారు. ఈఏడాది అక్రిడేషన్ లేనికారణంగా సొసైటీలోని దాదాపు 250 మంది సభ్యులు ఇళ్ల స్థలాలకు అర్హత కోల్పోయారని, వారికీ న్యాయం చేయాలని కోరారు. కోవిడ్, ఇతర అనారోగ్యం, ప్రమాదాల్లో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు కూడా మానవీయకోణంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ అంశాలన్నింటినీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానించారు. సమావేశంలో సొసైటీ గౌరవాధ్యక్షులు జి.జనార్దనరావు, సలహాదారు ధవళేశ్వరపు రవికుమార్, ఉపాధ్యక్షులు కొయిలాడ పరశురాం, మురళీకృష్ణారెడ్డి, కోశాధికారి శరత్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులు పి.ఎ.రావు, బొప్పన రమేష్, సంయుక్త కార్యదర్శులు అనురాధ, బి.శివప్రసాద్, పాల్గొన్నారు.

బొజ్జన్నకొండ చరిత్రపై కరపత్రం విడుదల

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో తమ సంస్థ కార్యాలయంలో జాతీయ పర్యాటక దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా బుద్ధుని చిత్ర పటానికి పూలమాల వేసి ప్రార్థనలు చేశారు. అనంతరం ప్రముఖ ప్రాచీన బౌద్ధ పర్యాటక సందర్శక కేంద్రం శంకరం వద్ద గల బొజ్జన్న కొండ-భారతీయ సంస్కృతి వారసత్వ సంపద అన్న కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఉజ్జి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు వినకోట నీలేశ్ గుప్తా, కార్యవర్గ సభ్యులు పట్నాల కృష్ణ మోహన్, రొబ్బి మల్లేశ్వరరావు, కొత్తూర్తి రామారావు, సత్యవరపు బ్రహ్మాజీ, పెదిరెడ్ల సుజాత పాల్గొన్నారు.

టిడిపి హయాంలో బిసిలకు పెద్దపీట

ప్రజాశక్తి-సబ్బవరం : టిడిపి హయాంలో బీసీలకు పెద్దపీట వేసినట్లు మాజీ మంత్రి, టిడిపి పెందుర్తి నియోజకవర్గం ఇన్చార్జ్ బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. స్థానిక సీతారామ కళ్యాణ మండపంలో టీడీపీ మండల అధ్యక్షుడు మిడతాడ అధ్యక్షతన జరిగిన జయహో బిసి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎన్టీఆర్ టిడిపి స్థాపించినప్పుడే బీసీలకు 16 శాతం రాజకీయంగా అవకాశం కల్పించి, క్రియాశీలక పదవులను ఇచ్చినట్టు చెప్పారు. చంద్రబాబు హయాంలో 37శాతం బీసీలకు రాజకీయంగా పదవులను ఇచ్చినట్లు తెలిపారు. రానున్న ఎన్నికలలో టిడిపి జనసేన కూటమిని గెలిపించాలని కోరారు. అనంతరం బిసి సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, టిడిపి నాయకులు గండి రవికుమార్, భర్నికాన సాయినాధరావు, గండి దేముడు, రెడ్డి నారాయణరావు, దొడ్డి సూర్య ప్రకాష్, రేసుపూడి రమణ, రొంగలి దేముడు, కాకర నాని, శ్రీనివాసరావు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, పల్లా తాతారావు, కోరాడ శ్రీనివాసరావు, సర్పంచులు, జడ్పిటిసిలు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి- దేవరాపల్లి : స్థానిక భవిత కేంద్రంలో వికలాంగ విద్యార్థులకు ఎస్.అప్పారావు దంపతులు సమకూర్చిన రగ్గులను ఎంఈఓ పడాల్ దాస్ చేతుల మీదుగా గురువారం అందించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో వికలాంగు విద్యార్థులను చేర్పించి వారి అభివృద్ధికి తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు వికలాంగుల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, వాటిని అందరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 ఉషారాణి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కృష్ణస్వామి నాయుడు, లక్ష్మణ్, శ్రీదేవి, అప్పలనాయుడు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆసుపత్రులు, డాక్టర్లపై దాడులను అరికట్టాలి

ప్రజాశక్తి-చోడవరం : ఆసుపత్రులపైనా, డాక్టర్లపైనా దాడులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చోడవరం అధ్యక్ష కార్యదర్శులు రాజాన అప్పలనాయుడు, బండారు సత్యనారాయణలు కోరారు. చోడవరంలో మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో కష్ట ప్రయాసలకు లోనై డాక్టర్లు వృత్తిని కొనసాగిస్తున్నారని తెలిపారు. కరోనా కష్టకాలంలో ఎంతోమంది డాక్టర్లు తమ ప్రాణాలు కోల్పోయినా ప్రజలకు వైద్యం అందించారన్నారు. డాక్టర్లపైనా, ఆసుపత్రులపైనా దాడులను దాడులు చేసేవారిపై నాన్ బెయిల్‌బుల్ కేసులు నమోదు చేసే విధంగా పార్లమెంటులో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు దుర్గాప్రసాద్, శకుంతలరావు, రాందేవ్, దేవరపల్లి రవి, రంగనాయకులు, ఎల్.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని

గిరిజనుల డోలి యాత్ర

ప్రజాశక్తి-రోలుగుంట:తమను గిరిజనులుగా గుర్తించి 5వ షెడ్యూల్‌ల్లో చేర్చాలని పివిటిజి కొందు ఆదివాసి గిరిజన సంఘం, 5వ షెడ్యూల్ సాధన కమిటీ ఆధ్వర్యంలో రోలుగుంట మండలం అర్ల పంచాయతీ పెద్దగరువు, పాత లోసింగి, కొత్తలోసింగి గిరిజనులు గురువారం నాలుగు కిలో మీటర్ల డోలి యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు మాట్లాడుతూ, 250 మంది జనాభా కలిగిన ఈ గ్రామాల్లో నేటికీ 75 సంవత్సరాలు అవుతున్నా 5వ షెడ్యూల్లో గిరిజనులకు రక్షణ చర్యలు చేపట్టలేదన్నారు. నాన్ షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనులుగా గుర్తించలేదన్నారు. తరతరాలుగా సాగు చేస్తున్న భూములను సర్వే పేరుతో సాగులో లేని, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇస్తున్నారని విమర్శించారు. వీరి భూమికి రక్షణ లేకుండా పోయిందన్నారు. రోడ్డు సౌకర్యం లేక పోవడంతో నెలలో నాలుగు రోజులు గర్భిణీలు, బాలింతలను డోలిలో బుచ్చింపేట ఆసుపత్రికి తరలించాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. 2022లో గడపగడపకి కార్యక్రమానికి గుర్రాలపై వచ్చిన ఎమ్మెల్యే ధర్మశ్రీ ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు.రోడ్డు లేకపోవడంతో సొంతంగా ఇంటికి మూడు వేల చొప్పున చందాలు వేసుకొని నిర్మాణం చేసుకున్నారన్నారు. నర్సీపట్నం కేంద్రంగా మినీ ఐటిడిఎ ఏర్పాటు హామీ అమలు కాలేదన్నారు. నాన్ షెడ్యూల్ గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు అమలు కాలేదన్నారు. ఇప్పటికైనాసమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిటిజి సంఘం నాయకులు కిలో నరసయ్య, గ్రామ పెద్దలు కొర్ర సత్తిబాబు, కొర్రా రాజు, కొర్ర సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.


డోలి యాత్రతో నిరసన చేపడుతున్న ఆదివాసీ గిరిజనులు


పద్మావతికి గులాబీ పూల మొక్కను ఇస్తున్న సిబ్బంది

ఆర్‌టిసి సిబ్బందికి అభినందనలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి కె.పద్మావతి స్థానిక ఆర్టీసీ సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బస్సులను క్షుణ్ణంగా పరిశీలించి లోపాలను సరి చేసి డ్రైవర్లకు అప్పగించే బాధ్యత గ్యారేజి ఉద్యోగులపై ఉందని తెలిపారు. ఈ నమ్మకంతోనే డ్రైవర్లు ఎటువంటి ఒత్తిళ్ళకు లోను కాకుండా వాటిని నడుపుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చ గలుగుతున్నారన్నారు. దీంతో సంస్థకు మంచిపేరుతో పాటు ఆదాయం మెరుగుపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా డిపో డ్రైవర్లు, మెకానిక్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ సేవలు అందిస్తున్న మెకానిక్ కు బహుమతులు అందజేశారు. డిపోలో, బస్టాండ్లో డ్రైవర్లందరికీ గులాబీ పూలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ ధీరజ్, సహాయ ఇంజినీర్ ఆచారి పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న టిడిపి శ్రేణులు

టిడిపి నేతల ప్రచారం

ప్రజాశక్తి- నక్కపల్లి:నక్కపల్లి వెంకట్ నగర్ కాలనీలో గురువారం టిడిపి మేనిఫెస్టోపై టిడిపి శ్రేణులు ప్రచారం చేపట్టారు. తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పథకాలకు సంబంధించి కరపత్రాలను పంపిణీ చేశారు. టిడిపి- జనసేన ఉమ్మడి కూటమితో అందించనున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ శాఖ అధ్యక్షులు అడ్డూరి లోవరాజు, బూత్ ఇన్చార్జి పెద్దిరెడ్డి రమేష్, నాయకులు సకురు సత్యనారాయణ, మీసాల బాబులు, అల్లాడ తాతారావు, సకురు స్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబుల పంపిణీ

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం టి. అర్జాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం సుమారు ఎనిమిదోవ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా రావికమతం మండల వైస్ ఎంపిపి ఎం.భవాని ప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు.పాఠశాల హెచ్‌ఎం కెఆర్‌ఎస్ నాయుడు మాట్లాడుతూ, పాఠశాలలో సుమారు 62 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ శివయ్య నాయుడు, సిఆర్పి జి.రామారావు పాల్గొన్నారు.


ట్యాబులు చూపుతున్న విద్యార్థులు

తాగునీటి బోరుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-రావికమతం:మండల పరిషత్ నిధులతో మంచి నీటి బోరుకు శంకుస్థాపన చేసినట్లు తట్టబంద ఎంపీటీసీ పిల్ల శేషుబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తట్టబంద జంక్షన్ అయోధ్య నగర్ రామాలయం వద్ద మంచినీటి బోరు సౌకర్యం లేనందున, గ్రామ ప్రజల కోరిక మేరకు బోరును నిర్మించినట్లు ఆయన తెలిపారు.బోరును మంజూరు చేసిన ఎంపీపీ పైల రాజుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజాన నరసిం హులు, బండారు గణేష్, దాసరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న నాయకులు


సర్వే చేపడుతున్న సిబ్బంది

మందకొడిగా కుల గణన సర్వే

- సర్వర్ సమస్యతో సతమతం

ప్రజాశక్తి- కోటవురట్ల: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కుల గణన సర్వే మండలంలో మందకుడిగా కొనసాగుతుంది. సర్వర్ సాంకేతిక కారణంతో సిబ్బంది, వాలంటీర్లు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. సర్వే యాప్ ఓపెన్ అయ్యేందుకు చాలా ఎక్కువ సమయం పడుతునంది. దీంతో, గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. సర్వే యాప్ ఓపెన్ అయినా డేటా సేవింగ్ కూడా చాలా సమయం పడుతుంది. పైగా ప్రతి ఇంటికి వెళ్లి చేయాల్సి రావడం, ఎక్కువ సమయం పట్టడంతో అటు ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. పనులు మానుకుని ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది మాట్లాడుతూ, ఈనెల 28 వరకు సాగనున్న కుల గణన సర్వేను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు.

త్వరితగతిన రహదారుల నిర్మాణ పనులు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ధర్మశ్రీ

ప్రజాశక్తి -రావికమతం:చోడవరం నియోజక వర్గాన్ని అభివద్ధిలో జిల్లాలో అగ్రగామిగా, రాష్ట్రంలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని ప్రభుత్వం విఫ్, ఎమ్మెల్యే ధర్మశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ, చోడవరం నియోజకవర్గంలోని గంధవరం నుంచి రోలు గుంట వరకు తారు రోడ్డు నిర్మాణం శరవేగంగా జరుగుతుందన్నారు.ఈ నియోజకవర్గానికి ఇప్పటికే సుమారు రూ.1900 కోట్ల నిధులు వెచ్చించి అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో అత్యధిక నిధులు చోడవరం నియోజకవర్గానికి వెచ్చించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థకు సంబంధించి నియోజకవర్గంలో 98శాతం ఇప్పటికే సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్లు పూర్తి చేశామని తెలిపారు. తారు రోడ్ల నిర్మాణాలు, డ్రెయిన్లు, కమ్యూనిటీ బిల్డింగ్స్, చేతి బోర్లు వంటి పనులను చేపట్టడం జరిగిందన్నారు. జగనన్న భూ హకు భూ రక్ష పథకం ద్వారా రైతులందరికీ నూతన పాసుపుస్తకాలు మంజూరు తో పాటు జగనన్న కాలనీలు, వ్యక్తిగత గృహాలు కూడా అత్యధిక శాతం చోడవరం నియోజక వర్గంకు తీసుకురావడం జరిగిందని చెప్పారు. జల జీవన్ మిషన్ పథకంకు చోడవరం నియోజక వర్గానికి అత్యధిక నిధులు తీసుకువచ్చి ఇంటింటి కొళాయిలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన అమ్మ వడి, రైతు భరోసా, జగనన్న విద్య దీవెన, జగనన్న విద్యా వసతి, జగనన్న కిట్టు, జగనన్న గోరుముద్ద, నాడు నేడు, వైఎస్ఆర్ చేయూత సంక్షేమ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేసిన ఘనత సీఎం జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు.


శంకుస్థాపన చేపడుతున ధర్మశ్రీ

ధర్మశ్రీ సుడిగాలి పర్యటన

కొత్తకోట: రావికమతం మండలంలోని గిరిజన పంచాయితో చీమలపాడు, ఇతర శివారు గ్రామాలలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ గురువారం సుడిగాలి పర్యటన చేశారు. ములకలాపల్లి, బంగారుబందల, కడగెడ్డ, తాటిపర్తి, రాయిపాడు, పెదగరువు, కొంజుర్తి, డూకులంపాడు, పెడెంపాలెం, ఆజేయపురం గ్రామాలలో పూర్తయిన ఇంటింటి కులాయిలను ఆయన ప్రారంబించారు. చలిసింగం గ్రామస్తుల చిరకాల కోరిక అయిన ఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ.2.36కోట్లు మంజూరు కావడంతో ఆయన భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పైల రాజు, జెడ్పిటిసి తలారీ రమణమ్మ ఆదిమూర్తి, మండల వైఎస్ఆర్ కాంగ్రేస్ఎం పార్టీ అధ్యక్షుడు ముక్కా మహలక్ష్మి నాయుడు. డిసిఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ మండల సచివాలయ కన్వీనర్ కంచీపాటి జగన్నాధరావు. ఆ గ్రామ సర్పంచ్ వజరి గంగరాజు, ఎంపిటిసి చిన్ని చినమ్ములు పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండలం పాకలపాడు గ్రామానికి చెందిన టిడిపి అభిమాని దళిత పేద కుటుంబానికి చెందిన గున్నంపల్లి పెద్దింట్లు చని పోవడంతో మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆర్థిక సహాయం అందించారు. గురువారం స్థానిక మాజీ సర్పంచ్ కామిరెడ్డి రామన్న చేతులు మీదుగా అందించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ, ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన దగ్గర నుండి నేటి వరకు తెలుగుదేశం పార్టీ వీరాభిమానిగా పెద్దింట్లు కొనసాడని తెలిపారు. వైసిపి ప్రభుత్వం కక్షసాధింపులో భాగంగా ఆయన వృద్ధాప్య పెన్షన్ తొలగించారన్నారు. భవిష్యత్తులో ఆయన కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీ ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కె.కోటపాడులో నిరసన చేపడుతున్న పెన్షనర్లు

సమస్యలు పరిష్కరించాలని

ప్రభుత్వ పెన్షనర్ల ధర్నాలు

ప్రజాశక్తి-విలేకర్ల బృందం

ప్రభుత్వ పెన్షనర్ల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఏపీ అమరావతి పిలుపు మేరకు గురువారం ప్రభుత్వ పెన్షనర్లు జిల్లాలోని పలు కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించారు.

కె.కోటపాడు :తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ప్రభుత్వ పెన్షనర్లు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు బండారు రామసత్యం మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డిఆర్ బకాయిలు విడుదల చేయాలని, 11వ పిఆర్‌సి ఎరియర్స్ వెంటనే చెల్లించాలని, హెల్త్ కార్డుల ద్వారా అన్ని వ్యాధులకు గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో వైద్యం అందించాలని, రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దారు రమేష్ బాబుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్లు కె.సరోజిని, జి.అప్పలనాయుడు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక తహశీల్దారు కార్యాలయం ఎదుట ప్రభుత్వ పెన్షనర్లు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు ఆదిరెడ్డి చినకన్నబాబు, ఆదిరెడ్డి చిన్నంనాయుడు మాట్లాడారు. అనంతరం తహశీల్దారు ఎం.లక్ష్మికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్లు పోతల చిన అప్పలనాయుడు, బడబళ్ల సత్యం, బొడ్డు అప్పారావు, సిహెచ్ అప్పలనాయుడు, రొంగలి సత్యం, ఆవుగడ్డ అప్పలనాయుడు, పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

పెన్షనర్ల నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:సమస్యలను పరిష్క రించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం వద్ద మహాత్మా గాంధీ విగ్రహం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు గజ్జలమ్మ మాట్లాడుతూ, పిఆర్‌సిలో తగ్గించిన అడిషనల్ క్వాంటమ్ యథావిధిగా పునరుద్ధరించాలని, పెండింగ్ డిఆర్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఆర్సి ఎరియర్స్‌ను ఇవ్వాలని కోరారు. హెల్త్ కార్డులతో అన్ని గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో ఉచిత వైద్యాన్ని అందించాలని తెలిపారు. మెడికల్ రీయంబర్స్మెంట్ రెండు లక్షల నుండి 5 లక్షలకు పెంచాలని కోరారు. 1వ తేదీ నాటికి తప్పనిసరిగా పెన్షన్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బీవీవి ఎస్ఎన్ రాజు, సీనియర్ సిటిజన్ కార్యదర్శి కెవి సుబ్బారావు, ఎం.శ్రీరామరాజు, నూకరాజు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



నర్సీపట్నంలో నిరసన చేపడుతున్న పెన్షనర్లు

29న రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-పాడేరు: యువత ముందున్న సవాళ్లపై అవగాహన కల్పించేందుకు విజయవాడలో ఈ నెల 29న ఏఐవైఎఫ్ రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండల కార్యదర్శి ముచ్చల లక్ష్మణ్ తెలిపారు. సదస్సు పోస్టర్లను గురువారం పాడేరులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతకు ఉద్యోగాలు, ఉపాధి కరువైందన్నారు. డిగ్రీలు చదివినా చిన్న ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

ఘనంగా ఓటర్ల దినోత్సవం

-పలు చోట్ల ర్యాలీలు, మానవహారాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం విశాఖ, అనకాపల్లి జిల్లాలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఎక్కడికక్కడ ర్యాలీలు తీశారు. ప్రతిజ్ఞలు చేశారు. ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

విశాఖ కలెక్టరేట్ : జిల్లాలోని ప్రతి ఒక్క ఓటరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఓటర్లకు పిలుపునిచ్చారు. ఓటు హక్కు వినియోగంలో ఎటువంటి ప్రలోభాలకూ గురికావొద్దన్నారు. గురువారం ఉదయం ఉడా చిల్డ్రన్స్ ఎరీనాలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం జరిగింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, డిప్యూటీ పోలీస్ కమిషనర్ ఆనందరెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్ పాల్గొన్నారు. గురజాడ కళాక్షేత్రం నుంచి ఉడా చిల్డ్రన్స్ ఎరీనా వరకు ర్యాలీ నిర్వహించారు.

ఎంవిపి.కాలనీ : ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వర్సిటీ ప్రాంతీయ కేంద్ర సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు పాల్గొన్నారు. ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ సిఎమ్‌డి పృథ్వీతేజ్ ఇమ్మడి మాట్లాడారు. సంస్థ డైరెక్టర్లు బి.రమేష్ ప్రసాద్, డి.చంద్రం, ఎవివి.సూర్యప్రతాప్, సిజిఎంలు ఎం.రామకృష్ణ, వి.విజయలలిత, జె.శ్రీనివాసరావు, బి.రామచంద్రప్రసాద్, డి.సుమన్ కల్యాణి, అచ్చి రవికుమార్, పి.శ్రీనివాస్, ఎస్.హరిబాబు పాల్గొన్నారు.

సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసు ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృథ్వీతేజ్ ఇమ్మడి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు బి.రమేష్‌ప్రసాద్, డి.చంద్రం, ఎవివి సూర్యప్రతాప్, సిజిఎంలు ఎం.రామకృష్ణ, వి.విజయలలిత, జె.శ్రీనివాసరావు, బి.రామచంద్రప్రసాద్, డి.సుమన్ కల్యాణి, అచ్చి రవికుమార్, పి.శ్రీనివాస్, ఎస్.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కోరారు. సీతమ్మధారలోని తన కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి ఓటర్ల దినోత్సవం గురించి వివరించారు.

భీమునిపట్నం : స్థానిక ఎండిఒ కార్యాలయం వద్ద ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. యువ ఓటర్లకు తహశీల్దార్ సిహెచ్‌వి రమేష్ బహుమతులు అందజేశారు. స్థానిక ప్రభుత్వ డైట్, జూనియర్ కళాశాల విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ డి.భాస్కరరావు, డిప్యూటీ తహశీల్దార్ ఎస్.శ్రీనుబాబు, ఎండిఒ డాక్టర్ వి.జానకి, ఎంఇఒలు ఎం.శివరాణి, జయప్రద, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒలు వేణుగోపాల్, ప్రసాదరావు పాల్గొన్నారు

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యాన భీమిలిలో వాలంటీర్లు, విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ సిహెచ్.సూర్య ప్రసాద్ పాల్గొన్నారు.అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ ఎ.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ ఎ.అర్జునరావు, ఎన్ఎస్ఎస్ విభాగాధిపతి ఎస్.షరీఫ్ పాల్గొన్నారు. సింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటలో ఎంపి ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవం నిర్వహించారు

ములగాడ: స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యాన జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఐపిఎస్.భాగ్యలక్ష్మి వై.అనసూయాదేవి, ఎస్. నదియా, వి.అంజలీదేవి, ఎ.సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

కరాస: గోపాలపట్నం తహశీల్దార్ కార్యాలయం ఆధ్వర్యాన 52వ వార్డు శాంతినగర్ సామాజిక భవనంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, ఎమ్మెల్యే గణబాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్ బొమ్మిడి రమణ ములగాడ తహశీల్దార్ వీరభద్రరావు, జోనల్ కమిషనర్లు మల్లయ్యనాయుడు, ఆర్‌జివి కృష్ణ, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ బిఎస్.కృష్ణ పాల్గొన్నారు.

ఓటేయడం అందరి బాధ్యత

జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి:ఎన్నికల్లో ఓటేయడం అందరి బాధ్యత అని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పిలుపునిచ్చారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఎన్టీఆర్ మైదానం నుండి రోటరీ క్లబ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అందరి చేత ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం రోటరీ క్లబ్‌లో ఆడారి బంగారమ్మ, కొణతాల అప్పలనరసమ్మ తదితర వృద్ధ ఓటర్లను, పి.వీరూయాదవ్, ఎం.చంద్రశేఖర్, వై.రవి తదితర వికలాంగ ఓటర్లను సన్మానించారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్పీ కెవి.మురళీకృష్ణ, జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి.సూర్యప్రకాష్‌రావు, జెసి ఎం.జాహ్నవి, అడిషనల్ ఎస్పీ బి.విజయ భాస్కర్, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ రాజ్, డిఆర్ఒ బి.దయానిధి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




అనకాపల్లిలో కలెక్టర్ ప్రతిజ్ఞ

స్థానిక డైట్ కళాశాలలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత, అసిస్టెంట్ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామర్ ఆఫీసర్ రమేష్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలెంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

చోడవరం : ఉపోదయ కాలేజీ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ వెంకట వాసు, హెచ్‌డిటి లక్ష్మీనారాయణ, ఎన్నికల అధికారి డి.లక్ష్మీనారాయణ, ఆర్ఐ పి.వెంకటగిరి, జూనియర్ అసిస్టెంట్ పి.వెంకటేష్, కృష్ణారావు, ఉపోదయ ఎన్ఎస్ఎస్ అధికారి అప్పలనాయుడు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం జరిగిన సదస్సులో మాడుగుల నియోజకవర్గ ఎన్నికల అధికారి, డిప్యూటీ కలెక్టర్ టి.రాజు మాట్లాడారు. తహశీల్దార్ రమేష్ బాబు, ఎంపీడీవో ప్రసాద్, ఎంఈఓ డివిడి ప్రసాద్, ఇన్చార్జి హెచ్ఎం పద్మావతి పాల్గొన్నారు.



నక్కపల్లిలో ఓటర్లకు సన్మానం

సబ్బవరం : స్థానిక డిప్యూటీ తహశీల్దార్ వెంకట్ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల విద్యార్థులతో మండల పరిషత్ కార్యాలయం నుండి మూడు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారం చేపట్టారు. ఓటు హక్కును వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఎఓ షేక్ బాబురావు, ఆర్ఐ వీరయ్య పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ముందుగా ముగ్గురు వృద్ధ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.లక్ష్మి, ఎంపీడీవో సిహెచ్.సుబ్బలక్ష్మి ఎంఈఓ పడాల్‌దాస్, జివి.రమణ పాల్గొన్నారు.



నర్సీపట్నంలో ర్యాలీ చేపడుతున్న ఆర్‌డిఒ, తదితరులు



ఎపిఇపిడిసిఎల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

బుచ్చయ్య పేట : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ అరుణచంద్ర ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ చేశారు. సీనియర్ సిటిజన్స్‌ను సత్కరించారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం బంగారు మెట్ట ఎల్పీపి అగ్రహారం, గంటికొర్లాం తదితర పాఠశాలల్లో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి పురవీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. కో-ఆపరేటివ్ అధ్యక్షులు సాయం రమేష్, సర్పంచ్‌లు మెరుగు కుమారి బాబురావు, శరకన బాబురావు, ఎంపిటిసి ఎల్లపు జగ్గారావు, వీఆర్వో సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు సత్యనారాయణ సతీష్ పాల్గొన్నారు.

కశింకోట : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఓటర్స్ డే సందర్భంగా విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎంఆర్‌వి.అప్పారావు, పిడి వి.ప్రభాకర్, బి.అప్పారావు, ఆచంట నాగేశ్వరరావు, ఆచంట రవి పాల్గొన్నారు.

నక్కపల్లి:ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ అంబేద్కర్ కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సీనియర్ సిటిజన్‌లను ఘనంగా సత్కరించారు.ఓటరు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీలు నానాజీ, ఈశ్వరరావు, ఏవో సీతారామరాజు, ఎంఈఓ కె.నరేష్, హెచ్. ఎమ్.రాణీలలిత, ఎన్నికల డిటీ. తాతాచార్యులు, ఎంపీటీసీ సభ్యులు గంటా తిరుపతిరావు ,తెలుగు ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు పాల్గొన్నారు.

పెదబోదుగల్లం హైస్కూలులో మానవహారం చేశారు. స్వస్తిక్ ఆకారంలో విద్యార్థుల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది.

నర్సీపట్నం టౌన్:మండల కేంద్రంలో ఆర్డీవో సిహెచ్ జయరాం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక శ్రీ కన్య కూడలి నుండి శారదా నగర్, వెంకునాయుడుపేట, పాల్ ఘాట్ సెంటర్ మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. ఆర్డీవో జయరాం, తహసీల్దార్ అన్నాజీరావు, ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ రవిబాబు పాల్గొన్నారు.

మాడుగుల:స్థానిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ, బస్టాండ్ ఆవరణలో మానవహారాన్ని నిర్వహిం చారు. ఉపాధ్యాయుడు బాబి జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పీవీ రత్నం, డిటిఓ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ టి.నాగేశ్వరరావు, ఆర్ఐ ఎర్ర వెంకటేష్ పాల్గొన్నారు.

కోటవురట్ల: మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో అధికారులు ఓటు హక్కు వినియోగం పై ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలో తహసీల్దార్ జానకమ్మ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల నుండి రాలీ నిర్వహిస్తూ ప్రధాన కూడలి వద్ద మానవహారం చేపట్టారు. పొందూరు గ్రామంలో ఓటు హక్కు వినియోగంపై ఆకర్షణీయంగా ముగ్గులు వేశారు. స్థానిక ఎస్సై రమణయ్య, ఉప తహసీల్దార్ సోమశేఖర్ పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలో జోగంపేట సెంటర్లో ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. స్థానిక హైస్కూలు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ సత్యనారాయణ, హెచ్ఎం వి.సరోజినీ పాల్గొన్నారు.